ప్రజాశక్తి

ఆదివారం 7 జనవరి 2024 8 పేజీలు




ప్రకాశం బాపట్ల

సమ్మె ఉద్రిక్తం



కార్పొరేషన్ కార్యాలయం గేటు ఎదుట బైటాయించిన కార్మికులు

- కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించిన మున్సిపల్ కార్మికులు
- పోలీసులు, కార్మికుల మధ్య తోపులాట

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మున్సిపల్ కార్మికుల సమ్మె ఉద్రిక్తంగా మారింది. సమస్యల పరిష్కారం కోసం ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు 12వ రోజు శనివారం సమ్మె నిర్వహించారు. అందులో భాగంగా మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం గేట్ ఎదుట బైటాయించి లోనికి ఎవరూ వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో కార్యాలయంలో పార్కింగ్ చేసిన కమిషనర్ కారు, చెత్తవాహనాలు లోపలే ఉండిపోయాయి. ఉద్యోగులు కూడా ఆఫీసు లోపలకు వెళ్లకుండా బయటే ఉండిపోయారు. మున్సిపల్ కార్యాలయం ముట్టడి గురించి తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మున్సిపల్ ఆఫీసు గేట్లు తెరవాలని, కార్యాలయంలోపల ఉన్న కమిషనర్ కారు, చెత్త వాహనాలను బయటకు పంపాలని కార్మికులకు సూచించారు. అందుకు కార్మికులు ఒప్పుకోలేదు. దీంతో పోలీసులు బల వంతంగా మున్సిపల్ కార్యాలయం గేట్ల వద్ద నుంచి కార్మికులను ఖాళీ చేయిం చేందుకు ప్రయత్నించారు. దీన్ని కార్మికులు అడ్డుకున్నారు. ఈక్రమంలో పోలీసులు, కార్మికులకు మధ్య తోపులాట జరిగింది. డిఎస్‌పి, ముగ్గురు సిఐలు, ఎస్ఐలు, భారీ స్థాయిలో పోలీసులు మున్సిపల్ కార్యాలయం వద్ద మోహా రించారు. యూనియన్ జిల్లా గౌర వాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు తంబి శ్రీని వాసరావును పోలీసు జీపు ఎక్కించేందుకు ప్రయత్నించారు. తంబి శ్రీనును పోలీసు జీపు ఎక్కించారు. చీకటి శ్రీనివాసరావును కూడా పోలీసులు జీపు ఎక్కించేందుకు ప్రయత్నించగా కార్మికులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. పోలీసు వాహనాలు అక్కడ నుంచి కదలకుండా జీపులకు అడ్డంగా కూర్చున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. పోలీసుల జీపులకు కార్మికులు అడ్డంగా కూర్చోవడంతో జీపులో ఎక్కించిన సిఐటియు నాయకుడు తంబి శ్రీనివాసరావును పోలీసులు జీపు దించేశారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు ముట్టడి వద్దకు చేరుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని, కోవిడ్ కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలు చెల్లించాలని కార్మికులు కమిషనర్‌ను కోరారు. కార్మికుల సమస్యల పట్ల కమిషనర్ స్పం దించారు. కోవిడ్ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించేందుకు తాను సిద్ధంగాఉన్నానని, కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆలస్యం అవుతోందని చెప్పారు. త్వరలోనే వారి జీతాలు చెల్లిస్తామని, తమ పరిధిలో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల ▶ 2లో



మహిళా కార్మికులను అరెస్టు చేస్తున్న పోలీసులు

డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

పేదల కష్టం తెలిసిన నాయకుడు

- టిడిపి అధినేత చంద్రబాబు
- అన్నా క్యాంటీన్ పరిశీలన
- నాయకులతో ఫొటోలు దిగి ఉత్సాహపరిచిన వైనం



చంద్రబాబు నాయుడుతో డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పేదల కష్టం తెలిసిన నాయకుడని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రెండో రోజు పర్యటనలో భాగంగా మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ను శనివారం చంద్రబాబు పరిశీలించారు. అన్న క్యాంటీన్‌ను ప్రారంభించి 365 రోజులు అవుతున్న సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పేదలకు స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఫొటోలు దిగి ఉత్సాహపరిచారు. అదేవిధంగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రూపొందించిన పాటల సిడిని ఆవిష్కరించారు. వైసిపికి చెందిన పలువురు నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన టిడిపి ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు, నాయకులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్ ▶ 2లో



అన్నం వడ్డిస్తున్న చంద్రబాబు నాయుడు

మాగుంట కోసం...

బాలినేని తీవ్రయత్నాలు

- పట్టాలిస్తే ఒంగోలులోనే పోటీ అంటున్న ఎమ్మెల్యే



ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిపైనే జిల్లా రాజకీయాలు కీలకంగా ముడిపడి ఉన్నాయి.పార్లమెంట్ అభ్యర్థి తేలాకే అన్ని కొలిక్కివస్తాయనే భావనలో సీనియర్ నేత బాలినేని ఉన్నారు. తొలి నుంచి తాను ఒంగోలు అసెంబ్లీకి, మాగుంట శ్రీనివాసులరెడ్డి ఎంపీగా పోటీ చేస్తారని బాలినేని చెబుతూ వచ్చారు. అయితే అధిష్టానం ఆలోచనలు తారుమారు చేశాయి. వలస విధానాన్ని తెరపైకి తెచ్చి ఇద్దరు మంత్రులను స్థానాలు మార్చేశారు. వీరితోపాటు సిట్టింగులకు టిక్కెట్లు లేవని కొందరికి చెప్పగా కొందరిని వేరేస్థానాలకు పంపుతున్నారు. అంతేకాకుండా పార్లమెంట్ టిక్కెట్‌ను మాగుంటకు ఇచ్చే యోచనలో కనిపించకపోవడంతో మాజీ మంత్రి బాలినేని గందరగోళంలో పడ్డారు. ఈపరిణామాల వెనుక తన బంధువు పాత్ర ఉన్నట్లు కొద్ది నెలలుగా బాలినేని గుర్రుగానే ఉన్నారు. సిఎం జగన్ భారీ మార్పులకు శ్రీకారం చుట్టడంతో బాలినేని కూడా ఏం చేయాలో తెలియక అయోమయంలో పడ్డారు. మంత్రులనే మార్చేశాక పరిస్థితులు తారు మారయ్యాయనే భావనలో ఉన్నారు. అధిష్టానం తీసుకునే నిర్ణయాలను గట్టిగా వ్యతిరేకించే పరిస్థితి కూడా లేకుండా పోయింది. తన ఎజండా అమలు చేయమని గట్టిగా చెప్పలేని పరిస్థితి కూడాఎదురవుతోంది. ఇటీవల సిఎం జగన్‌తో భేటీ అయ్యాక ఎవరిని ఎక్కడ పెట్టాలనే దానిపై జాబితా ఇచ్చారు. ఈ మేరకు వైపాలెం ఖరారైంది. మార్కాపురంలోనూ బాలినేని సూచించిన వారికే దాదాపుగా ఖరారవుతోంది.ఇపుడు ఎంపీ అభ్యర్థిపై బాలినేని దృష్టి సారించారు. మాగుంటకే ఎంపీ సీటు కేటాయించాలని ఆయన ఒక రకంగా యుద్ధమే చేస్తున్నారు. బాలినేని, మాగుంట శుక్రవారం హైదరాబాదులో భేటీ అయ్యారు. వారి మధ్య ఎంపీ సీటుపైనే చర్చ సాగింది. గట్టిగా ప్రయత్నం చేయాలని బాలినేనికి ఈ సందర్భంగా మాగుంట సూచించారు. లేకుంటే ప్రత్యామ్నాయాలు కూడా చూసుకోవాల్సిన పరిస్థితి కూడా ఇద్దరి మధ్య చర్చ సాగింది. ఇతర సామాజికవర్గాల నుంచి అభ్యర్థులను పోటీలో దించాలనే ఆలోచన సిఎం చేస్తున్నట్లు సమాచారం. కాపు లేదా బీసీలకు ఇవ్వాలనే ఆలోచనలోనూ ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ తరుణంలో బాలినేని గట్టిగా

మాట నిలబెట్టుకోలేని..

జగన్‌ను మహిళలే తరిమి కొడతారు

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి

ప్రజాశక్తి బాపట్ల

మాట నిలబెట్టుకోలేని జగన్‌ను మహిళలే తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా)రాష్ట కార్యదర్శి డి.రమాదేవి తెలిపారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు 24 రిలే నిరాహార దీక్షలు శనివారం చేపట్టారు. ఈ దీక్షలను రమాదేవి సిపిఎం నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ లక్ష మంది అంగన్‌వాడీలు కోటిమంది డ్వాక్రా, ఆశా వర్కర్ల తోడు చేసుకుని జగన్మోహన్ రెడ్డి తరిమి కొడతారన్నారు. మాట నిలబెట్టుకోలేని ముఖ్యమంత్రి హామీలు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని 26 రోజులుగా మహిళలు రోడ్డెక్కి ఆందోళన చేస్తుంటే ముఖ్యమంత్రుల్లో కనీసం కదలిక లేదన్నారు. ఎస్మా ప్రయోగించినంత మాత్రాన ఉద్యమిస్తున్న మహిళలు వెనక్కితగ్గన్నారన్నారు. దీక్షల్లో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి రేఖ ఎలిజిబెత్, హేమమాలిని, జి.శారద, ఝాన్సీ, మమత పాల్గొన్నారు. వారికి సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.మజుందర్, నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, వై. భాస్కరరావు, తిరుమలరెడ్డి ,శామ్యూల్, శరత్ పాల్గొన్నారు



దీక్షల్లో పాల్గొన్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

సిఐటియు రాష్ట మాజీ కార్యదర్శి వై.సిద్ధయ్య

ఒంగోలు కలెక్టరేట్ : అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర మాజీ కార్యదర్శి వై.సిద్ధయ్య డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 26వ రోజుకు చేరింది.ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకురాలు కెవి.సుబ్బమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. చర్చల పేరుతో ప్రభుత్వం, మంత్రులు కాలయాపన చేస్తున్నారన్నారు. న్యాయమైన డిమాండ్లు సాధించుకునేంత వరకూ అంగన్‌వాడీలు ఉద్యమాన్ని కొనసాగించాలన్నారు. సిఐటియు సంపూర్ణ ▶ 2లో

సమ్మె ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

న్యాయమైన కోర్కెలు తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్, నగర నాయకులు ఎస్‌డి. హుస్సేన్, యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, కుమారి, విజయ, పాల్గొన్నారు.

మార్కాపురం : సమ్మెలో భాగంగా కార్మికులు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. అధికారులు, సిబ్బంది లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. కార్మికుల సమ్మెలకు మద్దతుగా సిఐటియు జిల్లా నాయకులు డి. సోమయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె. సుబ్బరాయుడు, కార్మికులు గొట్టం హరికృష్ణ, షేక్ ఇమాంసా, తప్పెట్ల శ్రీనివాసులు, నక్కా శ్రీనివాసులు, గురజాల తిరుమలయ్య, పాపాబత్తిన శివకృష్ణ, శ్రీనివాసులు, గురునాథం, నందం వెంకటయ్య పాల్గొన్నారు.

చీమకుర్తి : మున్సిపల్ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్యాలయాన్ని కార్మికులు శనివారం ముట్టడించారు. ఈ సందర్భంగా కాలం సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలోనే సమానపనికి సమాన వేతనం ఇస్తామని,ఉద్యోగుల పర్మినెంట్ చేస్తామని, సిపిఎస్ రద్దు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. హామీ ఇచ్చి ఐదేళ్లు గడుస్తున్నా నెరవేర్చలేదన్నారు. గత్యం లేక కార్మికులు సమ్మె బాట పట్టాల్సి వచ్చిందన్నారు, ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యర్శులు వీరాంజనేయులు, ఆంజనేయులు, సిఐటియు నాయకులు పూసపాటి వెంకటరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇట్టా నాగయ్య, నాయకులు పి.పద్మ, ఏడుకొండలు, చెన్నమ్మ, సురేఖ, కల్యాణి, గోవిందు, పిచ్చయ్య, కోటేశ్వరరావు, కెవిపిఎస్ నాయకులు టి. రామారావు, రైతు సంఘం మండల కార్యదర్శి కె.చిన్నపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి : సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భ:గా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిసి. కేశవరావు, ఎఐటియుసి నాయకుడు బాలిరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలనా్రఉ. వారిని అప్కాస్ నుంచి మినహాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్‌కె. ఖాదర్‌వలి, చార్లెస్, మార్క్, గరటయ్య, దస్తగిరి, రమణమ్మ, ఈశ్వరమ్మ, దానియేలు, ఎఐటియుసి నాయకులు నాసర్‌వలి, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

దర్శి : సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుతం ఇప్పటికైనా స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కరుణానిధి, పిచ్చయ్య, తాండవ రంగారావు, మున్సిపల్ కార్మికులు, నాయకులు ఇర్మియా, ప్రభాకర్,విజయ్,శ్రీకాంత్,నవీన్, కాంతారావు పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-సిఎస్ పురం

రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త తమవంతు కృషి చేయాలని మండల టిడిపి అధ్యక్షులు బొమ్మనబోయిన వెంగయ్య తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తా ఐక్యంగా కలిసి పని చేయాలన్నారు. నియోజకవర్గంలో టిడిపి విజయ ఢంకా మోగిస్తుందని అన్నారు. గ్రామాల్లో ఇప్పటి నుంచే ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి పోరాడాలని కార్యకర్తలకు తెలియజేశారు. కనిగిరి సభను జయప్రదం చేసినందుకు ఆయన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్నమాలకొండయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, గోదాసు జయరాములు, పాలకొల్లు వెంకటరెడ్డి, కె వెంకటకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

'పొన్నూరు'కు పూర్ణకుంభ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న పొన్నూరు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్


ప్రకాశం జిల్లా రచయితల సంఘం గత 60 సంవత్సరాలుగా జిల్లాలో తెలుగు భాషాభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్నందుకు ఆ సంఘం అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులుకు పూర్ణకుంభ పుర స్కారాన్ని ప్రదానం చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఈనెల 5,6,7 తేదీలలో అంతర్జాతీయ తెలుగు భాషా ఉత్సవాలు నిర్వహించారు. హైకోర్టు న్యాయ మూర్తి డి.కృష్ణమోహన్, ఆంధ్రరాష్ట్ర అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు, గజల్ మాస్ట్రో గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యాసంస్థల ఛైర్మన్ చైతన్యరాజు చేతుల మీదుగా పొన్నూరు వేంకట శ్రీనివాసులు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, సంఘ సభ్యులు మూడమంచు వెంకటేశ్వర్లు, అడ్వకేట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-పొదిలి

లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి. నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్. మాజీ ఎంపిపి కోవెలకుంట్ల నరసింహారావు, మండల, నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి,నూర్జాహన్‌బేగం, ఉద్యోగ సంఘం నాయకులు గూడూరి వినోద్, నాయకులు జి శ్రీను, కల్లం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : మంత్రి



చెక్కులు అందజేస్తున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి-పొదిలి

దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా అనేక రకాల సంక్షేమ పథకాలను అన్ని వర్గాల వారికి అమలు చేస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. పొదిలి నుంచి సాగర్ జలాలను గుండ్ల సముద్రం, మర్రిపూడి రెండు చెరువులకు మళ్లించేందుకు అవసరమైన రూ.32 కోట్లు నిధులు మంజూరు చేయించామన్నారు. అదేవిధంగా మర్రిపూడి నుంచి పృథలగిరి లక్ష్మి నరసింహాస్వామి దేవస్థానానికి వెళ్లే ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరు ఉత్తర్వుల ప్రతిని మంత్రి సభలో ప్రదర్శించారు. ప్రతి ఒక్కరికీ అన్ని పథకాలను అమలు చేస్తున్న ఈ ప్రభుత్వంలో దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఉదయభాస్కర్, జెడ్పీటీసీ ఎం సుధారాణి, ఎంపిడిఓ ఎన్ సుదీప, తహశీల్దారు ఎం హరిబాబు, మర్రిపూడి సొసైటీ ఛైర్మన్ బీవి భాస్కర్‌రెడ్డి, చిమట సొసైటీ ఛైర్మన్ మాకినేని వెంకట్రావు, సీనియర్ నాయకులు ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, మాచేపల్లి నాగయ్య, బీవీ భాస్కర్‌రెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, సర్పంచ్ కదిరి భాస్కర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాగుంట కోసం.. బాలినేని తీవ్రయత్నాలు

(మొదటి పేజీతరువాయి)

దృష్టి సారించారు. సిఎం జగన్‌ను కలిసి గట్టిగా మాట్లాడి మాగుంటకు పార్టీ టిక్కెట్టు వచ్చేలా ప్రయత్నాలు చేయాలని నిర్ణయించుకున్నారు. సోమవారం సిఎం జగన్‌ను బాలినేని కలుస్తారని సమాచారం. చివరి వరకూ గట్టిగానే ప్రయత్నం చేస్తామని బాలినేని ఈ సందర్భంగా మాగుంటకు హామీ ఇచ్చారు. ఒకవేళ నిరాకరిస్తే మాగుంట పార్టీ వీడతారనే ప్రచారం కూడా లేకపోలేదు. ఇది కూడా బాలినేనికి సవాలుగా మారింది. ఇక్కడుంటే పార్టీ నుంచి తిరిగి పోటీచేసేలా అవకాశం కల్పించాలి.లేకుంటే ఆయన 2014లో మాదిరిగా వేరేపార్టీ నుంచైనా పోటీచేయడం అనివార్యంగా చూడాలి. ఇదొక సంక్లిష్ట అంశంగా అటు బాలినేనికి, ఇటు మాగుంటకూ మారింది. సిఎం జగన్ ఏ నిర్ణయం తీసుకుంటారనేదీ చూడాలి. ఇక ఒంగోలు అసెంబ్లీ కూడా పీటముడిగా మారింది. ఇతర నియోజకవర్గాల్లో ప్రచారం చేయాలంటే గిద్దలూరు నుంచి పోటీ చేయాలని సిఎం జగన్ స్వయంగా బాలినేనికి సూచించారు. అదే సమయంలో ఒంగోలుకు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కుమారుడిని పోటీలో పెట్టాలని సూచించారు. తర్జనభర్జనల అనంతరం శిద్దా పోటీ నుంచి తప్పుకున్నారు. అన్ని కోణాల్లో ఆలోచించి పోటీలో ఉండలేమని పార్టీపెద్దలకు చెప్పేశారు.దీంతో మళ్లీ ఒంగోలులో బాలినేని పోటీ తప్పేలా లేదనే చర్చ సాగుతోంది. మరోవైపు నగరపాలక సంస్థ ప్రతినిధులు కూడా బాలినేనిని కలిసి ఒంగోలులోనే పోటీచేయాలని కోరారు. ఇళ్లస్థలాలు ఇస్తామని మాట ఇచ్చామని, పట్టాలు ఇస్తే తానే ఒంగోలులో పోటీచేస్తానని బాలినేని చెబుతున్నారు.ఇంకొకరి ప్రతిపాదన కూడా అవసరం లేదని కొట్టిపారేశారు. తానే పోటీచేస్తానని నగరపాలకసంస్థ ప్రతినిధులకు చెప్పారు. ఇపుడు బాలినేని తిరిగి ఇక్కడే పోటీ చేయాల్సిన పరిస్థితులు లేకపోలేదు. మరోవైపు అధిష్టానం ఇక్కడ కాపు సామాజికవర్గం నుంచి పోటీలో దించాలనే ఆలోచనలోనూ ఉంది. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ పేరు కూడా చర్చలోకి వచ్చింది. సిఎం జగన్‌ను కలిసిన మద్దిశెట్టి అధిష్టానం నిర్ణయం మేరకు ముందుకు పోతారా?లేదా? అనేదీ చూడాలి. సిఎం జగన్‌ను సోమవారం బాలినేని కలుస్తారని సమాచారం. ఆ సమయంలో జిల్లాలో మిగతా నియోజకవర్గాల అభ్యర్థులపైనా తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పేదల కష్టం తెలిసిన నాయకుడు

(మొదటిపేజీ తరువాయి)

క్యాంటీన్ నిర్వహిస్తున్న ఉగ్రను అభినందించారు. కనిగిరిలో నిర్వహించిన 'రా కదలిరా' ఎన్నికల శంఖారావం ప్రారంభం, బహిరంగ సభ విజయవంతమైనదని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, నాయకులు దామచర్ల సత్య, గూడూరు ఎరిక్షన్‌బాబు, బిఎన్. విజయ్ కుమార్, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, నారపశెట్టి పాపారావు, కందుల నారాయణరెడ్డి, ఎంఎం.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులో దీక్షలను ప్రారంభిస్తున్న సిఐటియు రాష్ట్ర మాజీ కార్యదర్శి వై. సిద్ధయ్య

మాట నిబెట్టుకోలేని.. జగన్‌ను మహిళలే తరిమికొడతారు

(మొదటిపేజీ తరువాయి)

మద్దతు ఇస్తుందన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగిస్తామని చెటప్పం దుర్మార్గమన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి. కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడాలన్నారు. తెలంగాణ కంటే అదనంగా రూ.1000 జీతం ఇస్తామన్న సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు.

మహిళా సంఘాల సంఘీభావం

అంగన్‌వాడీల సమ్మెకు పలు మహిళా సంఘాల నాయకులు సంఘీభావం తెలియజేశారు. సంఘీభావం తెలిపిన వారిలో నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి శాంతకుమారి, మంజుల, జిల్లా ఉపాధ్యక్షురాలు బి.పద్మ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎం.విజయ, కార్యదర్శి అనంతలక్ష్మి, తెలుగు మహిళ ఒంగోలు పార్లమెంట్ కార్యదర్శి బి.అరుణారెడ్డి, నరసం ఉపాధ్యక్షురాలు సూర్యకుమారి ఉన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, సిఐటియు ఒంగోలు నగర అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.రాంబాబు, టి.మహేష్, శ్రామిక మహిళ కన్వీనర్ పి.కల్పన, అంగన్‌వాడీ నాయకులు కె.ప్రశాంతి, హేమీమా, పద్మ, నిర్మల, హేమీమా పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ

సిఎస్.పురం : కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా కోవిలంపాడులో ఆకుకూరలు, కూరగాయల విత్తనాలు శనివారం పంపిణీ చేశారు. ఈ కాక్యక్రమంలో వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ నున్నా త్రిమూర్తులు, కోవిలంపాడు సర్పంచ్ షేక్ బుజ్జి, ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌ఛార్జి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జనవరి నుంచి పెంచిన రూ.3 వేల పింఛన్ శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో పంపిణీ చేశారు. నిడమానూరు పంచాయతీలో సర్పంచ్ వడ్డిముక్కల శ్రీనివాసరావు, వైసిపి సీనియర్ నాయకులు పులిచర్ల పరంధామిరెడ్డి రూ.3 వేల పింఛన్లను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్ చెప్పినట్లుగా రూ.3 వేల పింఛన్ అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గంగ్ర రమణారెడ్డి, కార్యదర్శి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పోతవరం గ్రామంలో ఎంపిపి నలమలపు అంజమ్మ కష్టారెడ్డి దంపతులు పింఛన్లు పంపిణీ చేశారు. కనపర్తి గ్రామంలో హైస్కూల్‌లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబులను జాతీయ అవార్డు గ్రహీత సామాజిక సేవాకార్యకర్త కె త్రినాథ్‌రెడ్డి పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్ విద్యకు ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జె ప్రసాదరావు, సుబ్బారెడ్డి, శ్రీనివాసరావు, రామకృష్ణారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్ధవీడు: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణంలో శనివారం వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో సయ్యద్ మస్తాన్‌వలి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అర్ధవీడు జడ్పిటిసి విజయ, ఎంపీపీ వెంకట్రావు పాల్గొని ప్రసంగించారు. మునుపెన్నడు లేనివిధంగా జగనన్న ప్రభుత్వం అవ్వా తాతలకు, అర్హులైన ప్రతి ఒక్కరికీ వివక్ష చూపకుండా పెన్షన్లు మంజూరు చేసి వారి ఇంట్లో ఆనందాలు పంచుతోందన్నారు. మొత్తం 5,535 పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని దొనకొండ గ్రామ పంచాయతీ సంబంధించి భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. 'ఆడుదాం ఆంధ్ర' టీ షర్టులు, టోపీలు మండలంలోని సచివాలయాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అర్ధవీడు సర్పంచి మునగాల వసంతమ్మ, బోగోలు సర్పంచి పోతిరెడ్డి మొదటిపురం సర్పంచి పందుల రామకృష్ణారెడ్డి, బొల్లుపల్లి సర్పంచ్ మరియమ్మ, మండల సచివాలయ కన్వీనర్లు కృష్ణారెడ్డి, పోతిరెడ్డి గోపాల్‌రెడ్డి, రైతు పంచాయతీ కన్వీనర్ మునగాల వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, అవ్వ తాతలు, మండల ప్రజలు పాల్గొన్నారు.

దర్శి: దేశంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా వృద్ధులకు, వితంతువులకు రూ.3 వేలు పింఛన్ ఇస్తున్నట్లు తాళ్లూరు ఎంపీపీ పాటిబండ్ల శ్రీనివాసరావు అన్నారు. శనివారం తాళ్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కొండా యుగకీర్తి ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చార్లస్‌సర్జన్, పంచాయతీ కార్యదర్శులు శ్రీవల్లి, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

బైకు దొంగలు అరెస్ట్

ప్రజాశక్తి-మార్కాపురం

ఇటీవల మోటార్ సైకిళ్లు చోరీకి గురవుతున్నాయి. వీటిపై పోలీసులు దృష్టి సారించారు. చోరీలకు పాల్పడుతున్నది మైనర్ బాలురు కావడంతో పోలీసులు ఆశ్చర్యపోయారు. చోరీలకు పాల్పడుతున్న బాలురను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. నిందితులను శనివారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ ఆవుల వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. మార్కాపురం పట్టణంలో మూడు, మార్కాపురం మండలంలో, పెద్దారవీడు పోలీస్ స్టేషన్ పరిధిలో, కంభం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున మోటార్ సైకిళ్లను అపహరించినట్లు తేలిందన్నారు. నిందితులతో పాటు ఆరు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దొంగిలించిన మోటార్ సైకిళ్లను తక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకున్నారన్నారు. ఎవరైనా బైక్ కొనుగోలు చేయాలంటే ధ్రువపత్రాలు సక్రమంగా ఉంటేనే కొనుగోలు చేయాలన్నారు. లేని పక్షంలో కొనుగోలుదారులు కూడా నిందితులేనని హెచ్చరించారు. నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో మార్కాపురం పట్టణ ఎస్ఐ పి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-టంగుటూరు

అక్రమంగా తరలిస్తున్న 15 ఫుల్ మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌పి మల్లిక గర్గ్ ఆదేశాల మేరకు సింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, టంగుటూరు, సింగరాయకొండ ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా, శ్రీ రామ్ పోలీసు సిబ్బందితో కలిసి టోల్ ప్లాజా వద్ద శనివారం నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో బెంగుళూరు నుంచి రేపల్లె వెళుతున్న ఆరంజ్ ట్రావెల్స్ బస్సును ఆపి తనిఖీ చేశారు. బస్సులో ప్రయాణిస్తున్న బాపట్ల జిల్లా చెరువు జమ్మలపాలెం గ్రామానికి చెందిన పులి సురేంద్ర బ్యాగులో 15 ఫుల్ మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం తరలిస్తున్న సురేంద్రను అదుపులోకి తీసుకొని టంగుటూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ ఖాదర్‌బాషా వెల్లడించారు.

వెస్ట్ కాలనీ పట్ల 'సోమేపల్లి' దాతృత్వం

ప్రజాశక్తి-టంగుటూరు


మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న సోమేపల్లి మురళీకృష్ణ

టంగుటూరు పంచాయతీ పరిధిలోని పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో అధ్వానంగా అంతర్గత రోడ్లను సొంత నిధులతో జంగిల్ క్లియరెన్స్ చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నాడు వైసిపి నాయకుడు సోమేపల్లి మురళీకృష్ణ. గత కొన్నేళ్లుగా పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీ వాసులు అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా కాలనీలోని రోడ్లన్నీ బురదమయంగా మారి వీధులలోకి ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేనంత అధ్వానంగా ఉన్నాయి. దీనికి తోడు రోడ్ల పక్కన పిచ్చిచెట్లు అధికంగా పెరగడంతో రోడ్లు కూడా మూసుకు పోయి నడకదారికి కూడా అవకాశం లేదు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు తమ సమస్యను వైసిపి నాయకులు సోమేపల్లి మురళీకృష్ణకు వివరించారు. స్పందించిన మురళీకృష్ణ గత శుక్రవారం నుంచి సొంత నిధులు వెచ్చించి జెసిబిని కాలనీలో ఉంచి వెస్ట్ కాలనీ ఎస్టీ కాలనీ నుంచి దాదాపు 5 వీధులలోని రోడ్ల పక్కన ఉన్న పిచ్చిచెట్లను తొలగింపచేస్తున్నారు. ఇది చూసిన కాలనీవాసులు పలువురు తమ రోడ్లను కూడా బాగు చేయాలని మురళీకృష్ణను అభ్యర్థించడం గమనార్హం. ఈ సందర్భంగా కాలనీవాసులు సోమేపల్లి మురళీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ కాలనీ పాస్టర్ టి సుధీర్‌బాబు, నాయకులు గొడవర్తి కిషోర్ రాజు, నగిపోగు ఏడుకొండలు, హరీష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం మేడంవారిపల్లె గ్రామంలో గిద్దలూరు శాసనసభ్యులు అన్నా రాంబాబు 33 /11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఈ సబ్ స్టేషన్ రెండు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీని ద్వారా తొమ్మిది గ్రామాలకు విద్యుత్తు సరఫరా చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి సబ్ స్టేషన్ నిర్మించాలని ఏపీసీపీడీసీఎల్ కన్స్ట్రక్షన్ విభాగం వారికి ఎమ్మెల్యే అన్నా సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ ఇఇ పి నాగేశ్వరరావు, డిఇఇ బివై శేషగిరిరావు, కన్స్ట్రక్షన్ డిఇఇ గోవిందరావు, రాచర్ల, కొమరోలు ఏఇలు బాల గురవయ్య, శ్రీనివాసులు, గిద్దలూరు నియోజకవర్గం వైసీపీ కన్వీనర్ ఎర్రము వెంకటరామిరెడ్డి, ఎంపీపీ ఖాసింబీ, జడ్పీటీసీ పగడాల దేవి, సర్పంచి లతీఫ్, వైసీపీ నాయకులు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి నాయకుడికి మాతృవియోగం

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు మండలం నందనవనం పంచాయతీలోని పాపిరెడ్డిపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు చీకటి వెంకటసుబ్బయ్య తల్లి బాలమ్మ(85) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, మండల తెలుగుదేశం నాయకులు గాయం రామిరెడ్డి కందుల వెంకట సుబ్బారెడ్డి, దేవిరెడ్డి రాజారామిరెడ్డి, కూరాకు బాలనారాయణ, పెంచికల రామకృష్ణ, నందనవనం తెలుగుదేశం కార్యకర్తలు బాలమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పిచ్చయ్య మాస్టర్ మృతి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



లాయర్‌పేట సాయిబాబా మందిరం ఫౌండర్ మెంబర్, మున్సిపల్ హైస్కూల్ ఇంగ్లీషు అధ్యాపకులు బయ్యారపు పిచ్చయ్య మాస్టర్(87) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. అధ్యాపకుడిగా పిచ్చయ్య అనేకమంది విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేశారు. లాయర్‌పేటలో సాయిబాబా విగ్రహావిష్కరణను గులాబ్‌బాబా చేతుల మీదుగా జరిపించడంలో పిచ్చయ్య మాస్టర్ పాత్ర కీలకమైనది. ఒంగోలులో గులాబ్‌బాబా మందిరం ఏర్పాటు చేయాలనేది పిచ్చయ్య మాస్టర్ సంకల్పం. అయితే గత కొన్ని సంవత్సరాలు నుంచి అనారోగ్యం కారణంగా ఆయన ఆశయం కార్యరూపం దాల్చలేదు. పిచ్చయ్య మాస్టర్ మృతి పట్ల లాయర్‌పేట షిరిడిసాయి కల్చరల్ మిషన్ కమిటీ సభ్యులు విచారం వ్యక్తం చేశారు. పిచ్చయ్య అంత్యక్రియలు ఆదివారం ఉదయం ఒంగోలు తూర్పుకమ్మపాలెం మూడోలైన్‌లోని వారి స్వగృహం నుంచి ప్రారంభమవుతాయని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

10 నుంచి మెగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని డీజీ పేట గ్రామంలో ఈ నెల 10వ తేదీ నుంచి ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్థాయిలో మెగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.20,016, రూ.15,016, రూ.7,516, కప్‌లు ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ బహుమతులు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 9 లోపు రూ.400 ప్రవేశరుసుం చెల్లించి తమపేర్లు నమోదు చేసుకోవాలని వారు కోరారు. వివరాలకు ఆలూరి బాల కొండయ్య 9960049041, కె చారి 8008339581ని సంప్రదించాలని తెలిపారు.

బోధనా సిబ్బందికి డాక్టరేట్

ప్రజాశక్తి-మార్కాపురం


డాక్టరేట్ అందుకుంటున్న రాజాబాబు

మార్కాపురం సమీపంలోని దరిమడుగు వద్దగల శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న బోధనా సిబ్బందిలో ముగ్గురికి డాక్టరేట్లు వరించాయి. ఆ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్ రాజాబాబు, ప్రొఫెసర్ ఎస్‌వి సత్యనారాయణ, డాక్టర్ దిలీప్‌కుమార్‌లు డాక్టరేట్లు సాధించిన వారిలో ఉన్నారు. బెహరా పర్యవేక్షణలో 'సింథసిస్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ ఎడ్ సార్బెంట్స్ ఫర్ ఎడ్ సార్పన్ ఆఫ్ డైస్' అనే అంశంపై పరిశోధన చేశారు. కెమికల్ ఇంజనీరింగ్ విభాగంతో పాటు రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎన్ సరిత, డాక్టర్ ఎన్ దేవన్నల పర్యవేక్షణలో 'మెథోడ్ వాలిడేషన్ ఫర్ ఎల్‌సిఎంఎస్' అనే అంశంపై రసాయన శాస్త్రంలో పరిశోధన జరిగింది. దీంతో డాక్టరేట్ పట్టాలను జెఎన్‌టియు అనంతపురంలో శనివారం జరిగిన 13వ స్నాతకోత్సవంలో ప్రొఫెసర్, ఉప కులపతి రంగ జనార్దన్ చేతుల మీదుగా డాక్టరేట్లు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ఆదిమూలపు విశాల్, సలహాదారులు డాక్టర్ ఆదిమూలపు సతీష్, డీన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం మస్తానయ్యలతో పాటు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తాజా డాక్టరేట్లను అభినందించారు.

సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి-సంతమాగులూరు


మృతిచెందిన మస్తాన్‌వలి

బైకును లారీ ఢీకొన్న ఘటనలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కామేపల్లి, వెల్లలచెరువు గ్రామాల మధ్య, గుంటూరు కర్నూలు రహదారిపై శనివారం సాయంత్రం చోటు జరిగింది. అందిన వివరాల ప్రకారం... మార్టూరు మండలం వలపర్ల గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి(38) ఏల్చూరు సచివాలయం-2లో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఏల్చూరు గ్రామానికి చెందిన పెన్షనుదారుడు వినుకొండలో ఉండటంతో బైకుపై వినుకొండ వెళ్లి పెన్షను ఇచ్చి తిరిగి వస్తుండగా బైకును ఆర్‌టిసి బస్సు ఢీకొంది. దీంతో మస్తాన్‌వలి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మస్తాన్‌వలి మృతి పట్ల ఏల్చూరు సచివాలయ ఉద్యోగులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ కుమార్ తెలిపారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు

గ్రానైట్ వర్కర్స్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చీమకుర్తి: ది చీమకుర్తి ఏరియా గ్రానైట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) 2024 క్యాలెండర్‌ను సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, గ్రానైట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్ ఆంజనేయరెడ్డి, బి వీరాంజనేయులు, కోశాధికారి జి అప్పలనాయుడు, సిఐటియు నాయకులు పూసపాటి వెంకటరావు, ఇ నాగయ్య, కెవిపిఎస్ నాయకులు టి రామారావు, యూనియన్ నాయకులు టి శ్రీను, శంకర్, సురేష్, కనకరాజ్ పాల్గొన్నారు.

ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండలంలోని నందనవనం హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నందనవనం ఎంపిటిసి సూరిశెట్టి నారాయణస్వామి పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దాసరి నిరీక్షణ కుమార్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై ఎస్మా సిగ్గుచేటు



మాట్లాడుతున్న రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి రమాదేవి



రేపల్లెలో జీవో కాపీలు దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - చీరాల

మహిళలకు రక్షణ కల్పిస్తున్నామంటూ ప్రగల్బాలు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం మరోవైపు అంగనవాడి కార్యకర్తలపై నిర్బంధ చట్టాలను ప్రయోగిస్తూ అనేక ఇబ్బందులకు గురిచేస్తుందని మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద చేస్తున్న నిరసన సమ్మెకు ఆమె మద్దత్తు తెలిపారు. ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలిపితే ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తుందని అన్నారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఒకలాగా, అధికారంలోకి వచ్చాక మరోలా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతున్నాడని అన్నారు. తాను మహిళాపక్షపాతినని మాటలు చెబుతూ చేతల్లో మహిళలపై నిర్బంధ చట్టాలు ప్రయోగిస్తున్నాడని అన్నారు. చరిత్రలో ఎంతోమంది ఇలాంటి చట్టాలు తీసుకొచ్చిన వాళ్ళు ఇంటికి వెళ్లారని అన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంటే వెంటనే చర్చలకు పిలిచి అంగన్‌వాడీ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్మా చట్టానికి నిరసనగా గడియార స్తంభం వరకు ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్ గంగయ్య, ఎన్ బాబురావు, ఎం వసంతరావు, పి ప్రమీల, ఏ బ్యూలా, జి సుజన పాల్గొన్నారు.

రేపల్లె : రాజన్న రాజ్యం అంటూ హిట్లర్ పాలనని గుర్తు చేస్తున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ అన్నారు. సమ్మె శిబిరంలో వైఎస్సార్ చిత్రపటం పెట్టి ఎస్మా ప్రయోగించినా జీఒ కాపీలను దగ్ధంచేసి సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి కె వాణి మాట్లాడుతూ అంగన్‌వాడీలను టార్గెట్ చేసి బెదిరించటం అంటే అంగన్‌వాడీల పోరాటాలకు ప్రభుత్వం భయపడుతుందని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్, సిఐటియు నాయకులు డి జ్యోతి, వై మేరీమణి, నిర్మలజ్యోతి, శ్రీలత పార్వతి, రజిని, ప్రజా సంఘాల నాయకులు కెవి లక్ష్మణరావు పాల్గొన్నారు.

పర్చూరు : న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల సమ్మె శనివారం నాటికి 26వ రోజుకు చేరింది. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద చేస్తున్న అంగన్‌వాడీల నిరసనలో భాగంగా ఈరోజు ఖోఖో ఆటలు ఆడి తమ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె శ్రీనివాసరావు ఎం డేవిడ్, బి చిన్నదాసు, ఐ వెంకటలక్ష్మి, టి రాణి, టి జోస్న, పి శ్యామలదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

యద్దనపూడి : అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె శనివారం 26వ రోజు కొనసాగించారు. అంగన్‌వాడీలు తమ డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో జ్యోత్స్న, రేవతి, రమ, విజయ, సుమ, రత్న, మేరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : సిఐటియు జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం ముందు 26వ నంబర్ ప్రదర్శిస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని యూనియన్ నాయకులు తాళ్లూరు రాణి, శ్యామల, రాజేశ్వరి, కుసుమ, నాగపుష్పరాణి చెప్పారు.

కొల్లూరు : అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో 26వ రోజు కూడా నిరసన కొనసాగించారు. అంగన్‌వాడి కార్యకర్తలు కళ్ళు మూసుకుని నిరసన తెలిపారు. ఈ ప్రభుత్వం కళ్ళు ఉండి కూడా అంగన్‌వాడి కార్యకర్తల సమస్యలను పరిష్కరించలేకపోతుందని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి సుబ్బారావు, అంగన్‌వాడీ లీడర్స్ సౌభాగ్య లక్ష్మి, భాగ్యం, కాశి పద్మ, ఆదిలక్ష్మి, నాగరాజ కుమారి పాల్గొన్నారు.

నిజాంపట్నం: అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు ఉషా మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించని నేపథ్యంలో జిల్లా కేంద్రాల్లో 24గంటల రిలే నిరాహార దీక్ష శనివారం నుండి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా తమ ఉద్యమాన్ని ధైర్యంగా కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాలు రాజేశ్వరి, శ్రీలక్ష్మి, ధనలక్ష్మి, గాయత్రి పాల్గొన్నారు.

పంగులూరు : బెదిరింపులకు ఉద్యమాలు ఆగవని సిపిఎం జిల్లా నాయకులు రాయిని వినోద్ బాబు అన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్వాడీల శిబిరంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలను ప్రభుత్వం భయపెట్టాలని చూస్తుందని అన్నారు. చరిత్రలో ఎన్నో ప్రభుత్వాలు కార్మికులను, ఉద్యోగులను బెదిరించి విఫలమయ్యాయని అన్నారు. అంగన్‌వాడీల పొట్టలు కొట్టి ప్రభుత్వం ఎంతకాలం మనగలదని అన్నారు.

భట్టిప్రోలు : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన దీక్షలు శనివారంతో 26రోజులకు చేరాయి. అంగన్‌వాడీల శిబిరంలో నేలపై పడుకుని నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఎన్ని నిర్బంధాలనైనా ఎదుర్కొని పోరాటం చేస్తామని అన్నారు.

కారంచేడు : అంగన్‌వాడి ఉద్యమంపై ఎస్మా ప్రయోగించడం ప్రభుత్వం పిరికిపంద చర్యని సిఐటియు నాయకులు పి కొండయ్య అన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఆందోళనలో శనివారం ఆయన మాట్లాడారు. నిర్బంధం, బెదిరింపు చర్యల ద్వారా చట్టబద్ద హక్కుల కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను అణచివేసే చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి నాయకులు శ్రీలక్ష్మి, క్రీస్తు రాజ్యం, కళ్యాణి, హఫీజ, శివలీల, ఆదిలక్ష్మి, రాధా పాల్గొన్నారు.



భట్టిప్రోలులో అంగన్‌వాడీల నిరసన



మార్టూరులో అంగన్‌వాడీల నిరసన




మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రణాళిక బద్ధమైన కృషి అవసరం

శాసన మండలి సభ్యులు కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - చీరాల

పోటీ పరీక్షల్లో విజయానికి ప్రణాళికాబద్ధమైన కృషి అవసరమని పోటీ పరీక్షల నిపుణులు, ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఫిబ్రవరి 25న జరిగే ఏపీపీఎస్సీ గ్రూప్ 2 పరీక్షకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు స్థానిక ఎన్‌జి రంగనాయకులు, బాపనమ్మ కళ్యాణ మండపం నందు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రూప్1 అధికారి రాయుడు రవికుమార్ హాజరయ్యారు. ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రూప్ 2 పరీక్షకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు ప్రతిరోజు కొంత సమయం పత్రికలు చదవ డానికి కేటాయించాలని అన్నారు. తద్వారా జనరల్ నాలెడ్జ్ పెంపొందించుకోవడానికి కృషి చేయాలని అన్నారు. ముందుగా సమాధానం తెలిసిన ప్రశ్నలను పూర్తి చేయాల న్నారు. లక్షలాది మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారని అన్నారు. ఈ పోటీలో విజయం సాధించాలంటే ప్రణాళిక బద్ధమైన కృషి అవసరమని అన్నారు. కేవలం గైడ్లు, మెటీరియల్ కాకుండా అభ్యర్థులు కొన్ని ప్రామాణికమైన పుస్తకాలను అధ్యయనం చేసి నోట్స్ రూపొందించుకోవాలని సూచించారు. ఆంధ్రుల చరిత్ర - ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, భారత సమాజం అనే రెండు పుస్తకాలను, ఉచిత స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, యుటిఎఫ్ నాయకులు బి భిక్షాలు, షేక్ జానీబాషా, పి సురేష్, కుర్రా శ్రీనివాసరావు, పి సీతారామరాజు, కె వీరాంజనేయులు, కెవిపిఎస్ నాయకులు ఎల్ జయరాజు, ఎన్‌జి లూథరన్ కాలేజీ సిబ్బంది పుష్పరాజ్, జయశీలరావు, డివైఎఫ్ఐ నాయకులు సాయిరాం, ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, డిబిఆర్‌సి నాయకులు భగవాన్ దాస్, ఎస్సి, ఎస్టీ అసోసియేషన్ నాయకులు కె విజయకుమార్ పాల్గొన్నారు.



మహాసభల కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - రేపల్లె

ఎస్ఎఫ్ఐ పట్టణ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు కెవి లక్ష్మణరావు కోరారు. మహాసభ కరపత్రం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎన్ శివశంకర్ ఆవిష్కరించారు. జనవరి 9, 10తేదీల్లో స్థానిక కొరటాల సత్యనారాయణ మీటింగ్ హాల్ నందు జరగనున్నట్లు తెలిపారు. విద్యా సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. పట్టణంలోని విద్యా సంస్థల్లో విద్యార్థులకు వచ్చే సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ ఎన్నుకుంటున్నట్లు తెలిపారు. విద్యారంగంలో వస్తున్న సమస్యలు పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ కృషి చేస్తుందని అన్నారు. పట్టణంలోని విద్యార్థులు, విద్యా సంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యా శ్రేయోభిలాషులు, అందరూ ఆర్థిక, హార్దిక సహాయ సహకారాలు అందించి మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎం సూర్య ప్రకాష్, హైమశ్రీ, హేమ నాగశ్రీ పాల్గొన్నారు.

నేడు ఎన్‌డబ్ల్యుఎఫ్ సమావేశం

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక సుందరయ్య భవన్‌లో ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ బాపట్ల జిల్లా కమిటీ సమావేశం జరుగుతుందని అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, పి తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సభ్యులు అందరూ హాజరు కావాలని కోరారు.

కార్పొరేట్లపై ఉన్న ప్రేమ కార్మికులపై లేదా ?

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి - చీరాల

మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరాన్ని ఐద్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి శనివారం సందర్శించారు. కార్మికుల పోరాటానికి సంఘీ భావం తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు కోసం మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెలు చేస్తుంటే బాధ్యతగల ప్రభుత్వం కార్మికులతో చర్చించి సమస్యలు పరిష్కరించాల్సి ఉండగా బెదిరింపులకు పాల్పడుతుందని అన్నారు. నిధులు లేవు, మరోసారి అధికారంలోకి వచ్చాక జీతాలు పెంచుతానని అనడం విడ్డురంగా ఉందని అన్నారు. మరోసారి కార్మికులను మోసం చేసే చర్యని అన్నారు. కార్మికులకు ఇచ్చే జీతాలకి డబ్బులేనప్పుడు రూ.20వేల కోట్లతో స్మార్ట్ మీటర్ల ఒప్పందం శిరిడి సాయి ఎలక్ట్రికల్ కంపెనీకి ఏవిధంగా చేసుకొన్నారని ప్రశ్నించారు. విశాఖలో రూ.వందల కోట్లతో గెస్ట్ హౌస్ కట్టి ప్రజాధనాన్ని ఎందుకు దుర్వినియోగం చేస్తున్నారని ప్రశ్నించారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తే కార్మికులు గుండెల్లో పెట్టుకుంటారని అన్నారు. కార్యక్రమంలో సిఐటియూ జిల్లా నాయకులు సిహెచ్ గంగయ్య, పట్టణ అధ్యక్షులు ఎన్ బాబురావు, కార్యదర్శి ఎం వసంతరావు, ఏఐటియుసి నాయకులు ఏ బాబూరావు, మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులు వై సింగయ్య, ఎం రాజు, ఎం శంకర్, ఇమ్మానియేల్, జి మేరమ్మ, ఎం శ్రీను, డొక్కా ప్రభాకర్, కుమారి, సంధ్యా, కోటేశ్వరి పాల్గొన్నారు.

బాపట్ల : మున్సిపల్ కార్మికులకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ, జనసేన నాయకులు నామన వెంకట శివ నారాయణ కోరారు. మున్సిపల్ పారిశుద్య కార్మికులు చేస్తున్న సమ్మెకు శనివారం సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడి కార్యకర్తలు, మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బాపట్ల : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ కార్మికులు చేస్తున్న సమ్మె 11వ రోజుకు చేరింది. సిఐటియు ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మెలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్, మున్సిపల్ యూనియన్ నాయకులు అంకారావు, సాంబిరెడ్డి, ప్రమీల పాల్గొన్నారు.



ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలు అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

చదువుతోనే ఉన్నత స్థానం

ప్రజాశక్తి - రేపల్లె

సాంఘిక సంక్షేమ హాస్టల్లో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పుట్టగుంట ఆదినా ^యణ జ్ఞాపకార్థం యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణి చేశారు. ఎస్సి బాయ్స్ కాలేజ్ హాస్టల్లో జరిగిన సభలో ఏఎస్‌డబ్ల్యూఒ కట్ట సత్యనారా యణ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంవి సుబ్రమణ్యం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎన్ శివశంకర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, వార్డెన్ పి ప్రసాద్ పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థానానికి వెళ్లవచ్చని అన్నారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎం సూర్యప్రకాష్ రావు, యుటిఎఫ్ నాయ కులు ఎంవి సుబ్బారావు, భాస్కరరావు పాల్గొన్నారు.

జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - వేమూరు

సంక్రాంతి పండుగ సందర్భంగా ఎక్కడైనా కోడి పందాలు, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని చుండూరు సిఐ ఎ రాజమోహనరావు హెచ్చరించారు. కొద్దిరోజుల్లో ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ఎలాంటి అక్రమ క్రీడలకు తావు లేదన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ సమ్మె

- 'ఎస్మా'పై మండిపాటు
- జీవో ప్రతుల దహనం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె మండల కేంద్రమైన నాగులుప్పలపాడు సెంటరులో శనివారం నాటికి 26వ రోజుకు చేరింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా.. సమ్మె చేస్తున్న మహిళలపై బెదిరింపులకు పూనుకుంటూ నిర్బంధాలు విధించడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. సమ్మె ప్రదేశంలోనే వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి అక్కడనే తిని నిరసన తెలిపారు. జగనన్న అందరికీ అన్నీ ఇస్తున్నారని చెప్పు కుంటూ అంగన్‌వాడీలకు మాత్రం ద్రోహం చేయడం మంచి పద్ధతేనా అని ప్రశ్నించారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా మాపై ఎస్మా ప్రకటించడం దుర్మార్గమైన చర్య అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రకటిస్తూ జారీ చేసిన జిఒను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జె జయంతిబాబు, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి శ్రీకాంత్, యుటిఎఫ్ మండల శాఖ నాయకులు పాల్గొని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. అంగన్ వాడీలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వెంకట సుబ్బమ్మ, దుర్గాభవాని, రజని, ప్రమీల, రమాదేవి, ముత్యాలమ్మ, వివిధ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు: అంగన్వాడీలపై ఉక్కుపాదం మోపేందుకు తీసుకొచ్చిన జీవో నెంబర్ 2ను వెంటనే ఉపసంహరించు కోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె శనివారం 26వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రమైన మద్దిపాడులోని దీక్ష శిబిరం వద్ద జీవో నెంబర్ 2 కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా బంకా సుబ్బారావు మాట్లాడుతూ అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగిస్తూ ప్రభుత్వం జీవో తీసుకురావడాన్ని ఆయన తప్పు పట్టారు. సమ్మెలో సిఐటియు నాయకులు ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, లక్ష్మి, విజయలక్ష్మి, శారద, నిషా, మాధవి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కంభం: అంగన్‌వాడీలను భయపెట్టడానికే ఎస్మాను ప్రయోగించారని, వాస్తవానికి అంగన్‌వాడీలకు ఎస్మా వర్తించదని సిఐటియు, ఎఐటియుసి నాయకులు అన్నారు. స్థానిక కందులాపురం సెంటర్లో ఏర్పాటు చేసిన అంగన్వాడీల దీక్షా శిబిరంలో సమ్మె 26వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్మా అంగన్వాడీ కార్యకర్తలను భయపెట్టడానికే ఉపయోగించారని అన్నారు. అంగన్వాడీలకు ఎస్మా వర్తించదని, ఇది ఎమర్జెన్సీ ఉద్యోగులు పోలీసులు, డాక్టర్లు, నర్సులకు మాత్రమే ఇది వర్తిస్తుందని అన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని, దీక్షను విరమించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దానం, సిఐటియు నాయకులు వెంకట్, ఏఐటియూసీ నాయకులు షేక్ ఇబ్రహీం, మూడు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


నాగులుప్పలపాడులో జిఒ-2 ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పొన్నలూరు: పొన్నలూరు తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ 26వ రోజు సమ్మెలో భాగంగా శనివారం మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌కు అంగన్‌వాడీలు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం ఇచ్చారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

యర్రగొండపాలెం: అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా యర్రగొండపాలెంలో 26వ రోజు శనివారం పోర్లు దండాలతో నిరసన తెలిపారు. సిఐటియూ జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ, ఏరియా కో ఆర్డినేటర్ షేక్ అమీర్‌బాషా మద్దతు తెలిపి మాట్లాడారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు మల్లేశ్వరి, పి సుభాషిణి, ఎ నాగ మల్లేశ్వరి, అరుణ కుమారి, సుజాత, రోజా, సుబ్బులు, సిహెచ్ సునీత, అరుణ, కే జయమ్మ, ఏ నాగరాజుకుమారి, సుబ్బులు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు: అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని జన విజ్ఞాన వేదిక నాయకులు కోటపాటి నారాయణ డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు రామ్మూర్తి, నారాయణరావు, సిఐటియు నాయకులు టంగుటూరి రాము, వేశపోగు మోజెస్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శేషమ్మ, క్రాంతి, పచ్చవ శ్రీదేవి, సుభాషిణి, హేమలత, విజయ, జ్యోతి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 26వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు షేక్ ముంతాజ్, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, భారతి, ధనలక్ష్మి, మేరికుమారి, కాశీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొండపి: ప్రభుత్వం అంగన్‌వాడీల ఉద్యమాన్ని నిర్వీర్యం చేసేందుకు చూస్తోందని సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు అన్నారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా జీవో ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలక్ష్మి, పున్నమ్మ, విజయనిర్మల, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వెలిగండ్ల: వెలిగండ్ల అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయం వద్ద శనివారం రిలే నిరాహార దీక్షలు జరిగాయి. వెలిగండ్ల అంగన్‌వాడీ ప్రాజెక్ట్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ముక్కు మహాలక్ష్మమ్మ పూలమాలలు వేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ 5వ తారీకు విధుల్లోకి హాజరు కాకపోతే మీ అంతు చూస్తాం, ఉద్యోగాల నుంచి తీసేస్తాం అంటూ బెదిరించటం సరికాదన్నారు. ఇప్పుడు కొత్త ప్రయోగంతో ఎస్మా చట్టం ఆరు నెలలపాటు ప్రవేశపెడుతున్నామని బెదిరిస్తున్నారన్నారు. తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరని, ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు అంగన్‌వాడీ సమ్మె కొనసాగుతుందని అన్నారు. సిఐటియు జిల్లా నాయకులు రాయళ్ల మాలకొండయ్య మాట్లాడారు. ఈ రిలే నిరాహార దీక్షల్లో సోము వెంకటశ్రీలక్ష్మి, రెడ్డమ్మ, తిరుపతమ్మ, గొర్రెముచ్చు సలోమి, రాయల రమాదేవి, శెట్టి సునీత, గ్యారా ఈశ్వరమ్మ, గోపవరపు రమాదేవి, అక్కి మల్లేశ్వరి, వర్కర్స్ అండ్ హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

దర్శి: దర్శిలో అంగన్‌వాడీలు ప్రదర్శన నిర్వహించి గడియార స్తంభం సెంటర్‌లో జీవోను దహనం చేశారు. ఈ సందర్భంగా తాండవ రంగారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతమ్మ, సుజాత, జయమణి, జయమ్మ, నాగమణి, విశ్వవాణి, వెంకటరమణ, మల్లేశ్వరి, రైతు సంఘం నాయకులు సందు వెంకటేశ్వర్లు, ఉప్పు నారాయణ ఉన్నారు.

విద్యార్థులు భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలి

డాక్టర్ శరత్

ప్రజాశక్తి-మార్కాపురం

విద్యార్థులు భవిష్యత్ శాస్త్రవేత్తలుగా రాణించాలని డాక్టర్ బి శరత్ ఆకాంక్షించారు. శాస్త్రీయ దృక్పథంపై జన విజ్ఞాన వేదిక నిర్వహించిన వారోత్సవాల్లో భాగంగా సైన్స్ సంబరాల పోటీల్లో విజేతలకు శనివారం స్థానిక కమలా స్కూల్‌లో బహుమతులను పంపిణీ అందజేశారు. ఈ సందర్భంగా బివి నవీన, జి అనితారెడ్డి, ఎం శశికుమార్‌రెడ్డి బహుమతులను డాక్టర్ శరత్ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి పుల్లయ్య, జెవివి జిల్లా నాయకులు ఏనుగుల రవికుమార్, మండ్లా సాయిబాబు, నాగెళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగులకు యుటిఎఫ్ విరాళం

ప్రజాశక్తి-సిఎస్ పురం

తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న ఎస్-ఎస్ఎ ఉద్యోగులకు యుటిఎఫ్ తమ మద్దతు ప్రకటించింది. సిఎస్ పురం మండల యుటిఎఫ్ శాఖ తరపున రూ.11,111 విరాళాన్ని ఎంఇఓ ప్రసాద్‌రావు చేతుల మీదుగా సమ్మె చేస్తున్న ఉద్యోగులకు అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమ్మెకు తమ మద్దతు తెలుపుతూ తమ వంతు విరాళాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎస్ వెంకట్రామయ్య, కోశాధికారి కె వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిలర్ సాంబశివరావు, ఐ కొండయ్య, ఎస్ తిరుపతయ్య, డి నాగేశ్వరరావు, సిఐటిపి సతీష్, రమణయ్య, గౌసియా, నారాయణ పాల్గొన్నారు.

లౌడ్ స్పీకర్ అందజేత

ప్రజాశక్తి-పొన్నలూరు

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ 26వ సమ్మె విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఆంధ్రరత్న అవార్డ్ గ్రహీత కొండేపి విశ్వేశ్వరరావు రూ.నాలుగు వేల విలువ చేసే లౌడ్ స్పీకర్‌ను ఉచితంగా అందజేశారు. పొన్నలూరు తహశీల్దారు కార్యాలయం దగ్గర అంగన్‌వాడీ కార్యకర్తలకు దానిని అందజేశారు. ఆయనకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పొన్నలూరు మండల కమిటీ ధన్యవాదాలు తెలియజేసింది.

నేడు జనసేన జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వాడవాడలా జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా స్థానిక గద్దలగుంటలోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఆదివారం జనసేన పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు కొల్లా హనుమంతరావు, చెంగలశెట్టి సుధాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, రాష్ట్ర నాయకులు ఆమంచి స్వాములు, ఈదర హరిబాబు, రాయపాటి అరుణ, జిల్లా నాయకులు చిట్టెం ప్రసాద్, పార్టీ నగర అధ్యక్షుడు మలగా రమేష్, చిరంజీవి యువత నాయకుడు అడుసుమల్లి వెంకట్రావు పాల్గొంటారని పేర్కొన్నారు.


ఎంపికైన ప్రకాశం హాకీ జూనియర్ బాలుర జట్టు

హాకీ జిల్లా బాలుర జట్టు ఎంపిక


ప్రజాశక్తి-సంతనూతలపాడు

హాకీ ప్రకాశం అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపికలు ఒంగోలులోని డిఆర్ఆర్ ఎంఎం హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి 40 మంది పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ గల క్రీడాకారుల్ని జిల్లా హాకీ జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన హాకీ జట్టు ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని కార్యదర్శి సుందరరామిరెడ్డి తెలిపారు. జిల్లా జట్టు ఎంపికను అసోసియేషన్ సభ్యులు ఎస్ చంద్రశేఖర్, టి రవికుమార్ (హాకీ రవి), పి రవి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పీడీలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, పీటీటి వెంకట్రావు పాల్గొన్నారు.

వీరభద్రాపురం సర్పంచిగా అరుణకుమారి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని వీరభద్రాపురం సర్పంచ్‌గా ముటుకూరి అరుణకుమారికి ఎంపిడివో వైవీ నాగేశ్వర ప్రసాద్ శనివారం నియామకపత్రం అందజేశారు. ఇప్పటి దాకా సర్పంచ్‌గా పని చేసిన ఆలేటి ఆశీర్వాదం అనారోగ్య కారణాల రీత్యా ఆరు నెలల పాటు సెలవు కోరడంతో ఉప సర్పంచ్‌గా పని చేస్తున్న ముటుకూరి అరుణ కుమారిని సర్పంచ్‌గా నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఎంపీడీవో వైవీ నాగేశ్వర ప్రసాద్ నియమించారు. నియామక పత్రాన్ని ఎంపిపి దొంతా కిరణ్‌గౌడ్ యర్రగొండపాలెంలోని తన కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి మద్దుల ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.


అరుణకు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

ఎడ్ల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-దర్శి

జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన అట్టహాసంగా శనివారం జనసేన దర్శి నియోజకవర్గ నాయకులు గరికపాటి వెంకట్ ప్రారంభించారు. స్థానిక అద్దంకి రోడ్డులో జాతీయ స్థాయి ఒంగోలు స్థాయి ఎడ్ల బలప్రదర్శన నాలుగు రోజులు పాటు జరుగుతుంది. పది క్వింటాళ్ల బండ లాగుడు పోటీల్లో నాలుగు పళ్ల ఎద్దులు 38 జతల ఎడ్లు పాల్గొన్నాయి. పోటీలు రాత్రి ఒంటి గంట వరకు జరుగుతాయని నిర్వాహకులు గరికపాటి పవన్, గోపి తెలిపారు. తిలకించేందుకు ప్రజలు ఎద్దుఎత్తున వచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి బొటుకు రమేష్, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి అరుణ, దిరిశాల ఏసురెడ్డి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. 7వ తేదిన 12 క్వింటాళ్ళ, 8వ తేదిన 16 క్వింటాళ్ళ, 9వ తేదిన 22 క్వింటాళ్ల బరువు గల బలప్రదర్శన జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.


ఎడ్ల పందాలు ప్రారంభిస్తున్న గరికపాటి వెంకట్

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని గొట్లగట్టు కేజీబీవీ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు విలువచేసే యుటిఎఫ్ పబ్లిక్ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా దాతల సహకారంతో అందించారు. దాతలు సిహెచ్ సుబ్రహ్మణ్యం ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ నాయుడుపేట ఏప ప్రాథమిక పాఠశాల, షేక్ ఖాసింసా, చినమన గుండం ఏపి ప్రాథమిక పాఠశాల వారికి కేజీబీవీ విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ రాఘవ సురేఖ, విద్యాలయ ఉపాధ్యాయినులు యుటిఎఫ్ మండల శాఖకు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్ ఉపయోగించుకొని మొదటి శ్రేణిలో పాస్ కావాలని ఆకాంక్షించారు. అనంతరం దాతలను శాలువాతో సన్మానించారు. యుటి ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్ కామేశ్వర రావు, సిహెచ్ శర్మ, వేమూరి శ్రీనివాసులు, మహమ్మద్ అలీ, కే ఆదాము, మునగ రామారావు, క్రైపు సుబ్బారెడ్డి, బరిగేమస్తాన్ మొదలగు వారు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్లు అందజేత

ప్రజాశక్తి-కొమరోలు: గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు శస్త్ర చికిత్స అనంతరం తిరిగి శనివారం రోజు ప్రజాక్షేత్రంలోకి వచ్చారు. ముందుగా ఆయన ఇంటి ఇలవేల్పు అయిన రాచెర్ల మండలం జేపీ చెరువు గ్రామ సమీపంలోని నెమలిగుండ్ల రంగనాయక స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం కొమరోలులో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని ప్రారంభించారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అన్నాకు అడుగడుగునా నీరాజనాలు పలికిన ప్రజలు అనారోగ్య కారణాలతో కొన్ని రోజులుగా విశ్రాంతి తీసుకున్న రాంబాబు తిరిగి ప్రజ మధ్యకు రావడంతో వైసిపి కార్యకర్తలు, ఆయన అభిమానులు ఉత్సాహభరితులయ్యారు. ఆయనను ఆప్యాయంగా పలకరిస్తూ.. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో గిద్దలూరు వైసిపి అభ్యర్థిగా అన్నా మీరే పోటీ చేయాలని పలువురు నాయకులు, అభిమానులు ఎమ్మెల్యే అన్నాను కోరారు.



సమావేశంలో ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

ప్రజాశక్తి - పర్చూరు

ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను వైపరీత్యాల నుండి కాపాడటంతో పాటు విషపు అవశేషాలు లేని పంటలను పండించవచ్చుని, వాటిని వినియోగించుకోవడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వి వాణిశ్రీ పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ రైతులు, సిబ్బందితో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ ప్రణాళిక 2024 - 25 సంవత్సరానికి సంబంధించి ప్రణాళిక తయారు చేశామని తెలిపారు. రైతులు, సిబ్బంది భాగస్వామ్యంతో రూపొందించిన ప్రణాళిక అమలు చేయడం వల్ల అమలు సులభతరంగా ఉంటుందని తెలిపారు. మంచి ఫలితాలు ఇస్తుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా శనగ పండిస్తున్న ఇడుపుల పాడుకు చెందిన సిహెచ్ శ్రీకాంత్‌ను సత్కరించారు. ఎఒ ఎస్ రామ్మోహన్‌రెడ్డి, డిటి ఎంపి మోహన్, ఎంఎఫ్‌లు శ్రీనివాసరావు, లక్ష్మీ ప్రసన్న, ఎంటి అప్పారావు, వరదానమ్మ, శ్రీవల్లి పాల్గొన్నారు.



వైసిపిలో చేరిన వారితో రాంబాబు

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని పోలూరు గ్రామంలో ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన 9 కుటుంబాలు శనివారం ఎస్‌సి సెల్ అధ్యక్షులు పాలెపోగు రాంబాబు ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. రాంబాబు వారికి పార్టీ కండువాలు కప్పి సాధరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఐమాల శ్యాంసన్, వైసిపి సీనియర్ నాయకులు చిలుకూరి క్రిష్టయ్య చౌదరి, జిల్లెలమూడి హరిబాబు, గద్దల పండుయ్య, గద్దల జీవరత్నం, గద్దల కాజియ్య, పోలూరి ఆరోగ్యం, కందుల బెసలేరు, పోలూరి నాగయ్య, పోలూరి రామ్మోహన్, గొర్రెపాటి గురకయ్య, సోషల్ మీడియా కన్వీనర్ మున్నంగి వీరయ్య, పులగం చందు, పాలేపోగు పవన్, బిల్లా రంగా, పర్చూరు వాసు, బొబ్బేపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు రామారావును సన్మానిస్తున్న ఎంఇఒ

ఉద్యోగులకు బదిలీ సహజమే

ప్రజాశక్తి - పంగులూరు

ఉద్యోగులకు బదిలీలు సహజమేనని, దీనికి బాధపడకూడదని, ప్రభుత్వం ఎక్కడికి బదిలీ చేసిన అక్కడ మన బాధ్యత గుర్తెరిగి పని చేయటమే మన కర్తవ్యమని ఎంఇఒ కె నాగభూషణం అన్నారు. కల్లంవారిపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల్లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న పూసల రామారావు బదిలీపై జమ్ములమడక వెళుతున్న సందర్భంగా శనివారం పాఠశాల్లో ఘనంగా సన్మానం చేశారు. నాగభూషణం మాట్లాడుతూ రామారావు బాధ్యతాయుతంగా పనిచేశాడని అన్నారు. ఎంఇఒ2 జి వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధ్యాయ వృత్తి కత్తి మీద సాములా మారిందని అన్నారు. పాఠశాల హెచ్‌ఎం మారుతి, తన్నీరు వెంకట్రావు, బి వెంకటేశ్వర రావు, ఉపసర్పంచి గుడిపాటి మల్లారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -రేపల్లె

ప్రతి గ్రామంలో ప్రజలకు త్రాగునీరు, విద్యుత్ సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పెనుమాల సుశీల అధ్యక్షతన జరిగింది. మోపిదేవి మాట్లాడుతూ తీర ప్రాంతంలో త్రాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. జల జీవన్ మిషన్ క్రింద గ్రామాల్లో త్రాగు నీటి పైపులు మరమ్మతులు చేపట్టి త్రాగు నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో గ్రామాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ కోతలు నివారించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. అవసరమైన చోట నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. పెండింగులో ఉన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించి సర్పంచుల సహకారంతో గ్రామ అభివృద్ధికి విద్యుత్ శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జాబ్ కార్డు ద్వారా



సమావేశంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ

వేగవంతం చేయాలని అన్నారు. కూలీలకు వంద రోజుల పనిదినాలు కల్పించాలని ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో సమస్యలపై సర్పంచుల సమావేశం అధికారుల దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయా శాఖల అధికారులు పెండింగులో ఉన్న పనులను పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో సమావేశం ప్రశాంతంగా ముగిసింది. సమావేశంలో వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ఈవూరి గణేష్, ఎంపీడీఒ కె శివపార్వతి, ఈఓపిఆర్డి మల్లికార్జునరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు రావు నెహ్రూ లక్ష్మి కుమారి, పీతా సాంబశివరావు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్లు అందజేత



పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ బలరామకృష్ణమూర్తి

ప్రజాశక్తి - వేటపాలెం

వృద్ధాప్య పెన్షన్ దేశంలోనే అత్యధికంగా ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన వైఎస్సార్ పింఛన్ పంపిణీ నిర్వహించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ నెరవేరుస్తూ వృద్ధాప్య పెన్షన్‌ను దేశంలోనే అత్యధికంగా రూ.3వేలకు పెంచి ఇస్తున్న వ్యక్తి సీఎం జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. మండలంలో 11,014మంది లబ్ధిదారులకు రూ.3కోట్ల 5లక్షల 70వేల 500లు నేరుగా లబ్దిదారుని ఇంటి వద్ద అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఒ నేతాజీ, వైసిపి మండల అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, రామన్నపేట సర్పంచ్ కందేటీ రమణ, దంతం వెంకట సుబ్బారావు, లేళ్ల శ్రీధర్, పులి వెంకటేశ్వర్లు, జంగిలి రామారావు, అందే కృష్ణ, ఆవుల అశోక్, పులి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కట్టా గంగయ్య, సీతమహాలక్ష్మి, పృధ్వి చంద్రమోహన్, పులి హరికృష్ణ, షేక్ ఖాదర్, కర్ణ లక్షరావు, వేటగిరి సంజీవరావు, సాధు రాఘవ, జిడుగు మస్తాన్, జమ్మి ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

నిజాంపట్నం : సీఎం వైఎస్ జగన్ తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, వైసీపీ ఇంచార్జీ డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ పెన్షన్లు పంపిణీ చేవారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మోపిదేవి హరనాథ్ బాబు, మదన్, వాసు దేవా, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నగరం : పెన్షన్ రూ.3వేలకు పెంచి సిఎం ఇచ్చిన హామీని అమలు చేశారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ రావు అన్నారు. నూతన పెన్షన్లను మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం పంపిణీ చేశారు. ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య అధ్యక్షత వహించారు. సభలో వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ఈపూరు గణేష్, జడ్పిటిసి మాన్యం నాగమణి, ఎంపీడీఒ చక్రపాణి ప్రసాద్, తహశీల్దారు ప్రమీల, పిఎసిఎస్ చైర్మన్ బెల్లంకొండ పోలేరు, వెంకట రామయ్య, పధ్యాల బుల్లియ్య, రావి కాంతారావు, చందోలు దేవదాసు, వెంకటేశ్వరరావు, జాఫర్రు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ పెంచారని వైసీపీ ఇన్చార్జి వరికూటి అశోక బాబు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డివి లలిత కుమారి, జడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి, సర్పంచి ధారా రవికిరణ్మయి, ఉపసర్పంచి బూర్లె రాంప్రసాద్, వైసిపి మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, నాయకులు కుందేటి రమేష్, బాలాజీ, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



నగరంలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఇన్‌ఛార్జి డాక్టర్ గణేష్



వేమూరులో పెన్షన్ పంపిణీ చేస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి అశోక్

'భాష్యం'లో సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి - అద్దంకి

తెలుగు సాంప్రదాయ పండుగ సంక్రాంతి సందర్భంగా స్థానిక బంగ్లా రోడ్డులోని భాష్యం ఉన్నత పాఠశాల్లో ప్రిన్సిపాల్ జివిఎస్ఆర్ శాస్త్రి ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో హెచ్‌ఎం కల్పన, టీచర్స్ మన సాంప్రదాయాన్ని గుర్తిస్తూ పొంగళ్లు పెట్టీ, గొబ్బెమ్మలతో రంగ వల్లులు వేసి చెరుకులు, వరి మొక్కలను అందంగా కట్టి చిన్నారులకు బోగి పళ్లను పోశారు. చిన్నారులు ఆట, పాటలతో డాన్స్ చేసారు. ఈసందర్భంగా చిన్నారులు ధరించిన రైతు, హరిదాసు, నాగలి, దుస్తులు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ శాస్త్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. ఆ రోజున సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తాడని,



భాష్యం స్కూల్‌లో చిన్నారుల సంక్రాంతి సంభరాలు

అందుకనే మకర సంక్రాంతి అనే పేరు వచ్చిందని తెలిపారు. ఆ రోజు నుండి మనకు ఎండలు పెరుగుతూ వుంటాయని అన్నారు. వేడుకల్లో హెచ్‌ఎం కాకాని కల్పన, మహిళా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.



పెన్షన్లు పంపిణీ చేస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి హనిమిరెడ్డి

ఆదరించండి తోడుంటా

ప్రజాశక్తి - మేదరమెట్ల

స్వతహాగా తాను రాజకీయ నాయకున్ని కాదని, సామాన్య రైతు బిడ్డనని, ఆదరించి గెలిపిస్తే బిడ్డలా మీ తోడుంటానని వైసిపి ఇన్చార్జ్ పానెం హనిమిరెడ్డి అన్నారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక వారోత్సవాల్లో భాగంగా కోరిశపాడు హైస్కూల్లో శనివారం జరిగిన పింఛన్ పంపిణీలో ఆయన మాట్లాడారు. వస్తువులను డోర్ డెలివరీ చేస్తున్నట్లుగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మొదటి వారంలోనే మీ ఇంటికే పింఛన్లను పంపిణీ చేస్తున్నరని అన్నారు. గత ప్రభుత్వాల్లో రాజకీయ నేతల ద్వారానో, ఎవరైనా చనిపోతేనో పింఛన్ కొత్తగా వచ్చేదని, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత ఉంటే పరిమితి లేకుండా ఎన్నైనా ఇస్తున్నారని అన్నారు. అబద్దాలు చెప్పడం, చిల్లర రాజకీయం చేయడం, హంగు ఆర్భాటం చేయడం తన వ్యక్తిత్వానికి వ్యతిరేకమని అన్నారు. సామాన్యుడిగా, మీకు కష్టం వస్తే తోడుంటానని, ఆశీర్వదించి గెలిపిస్తే అద్దంకిని జగన్‌కు కానుకగా ఇద్దామన్నారు. ఎమ్మెల్యే అంటే ఏం చేయవచ్చో చేసి చూపిస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, తహశీల్దారు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

నేడు అద్దంకి రానున్న తనికెళ్ల భరణి

ప్రజాశక్తి - అద్దంకి



నటులు తనికెళ్ల భరణి

పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ జీవిత సాఫల్య పురస్కారానికి సినీ నటులు, కవి తనికెళ్ల భరణి ఎంపికయ్యారు. 2004లో ప్రారంభించిన ట్రస్టు అప్పటి నుండి లబ్ధప్రతిష్టులైన కవులను, కళాకారులను సన్మానిస్తున్నారు. 2023నుండి కవులక్కు, కళాకారులకు సాహిత్య పురస్కారాలను, జీవిత సాఫల్య పురస్కారాలను, కళా పురస్కారాలను అందచేస్తున్నారు. గత సంవత్సరం జీవిత సాఫల్య పురస్కారాన్ని పద్మశ్రీ కోట సచ్చిదానంద శాస్త్రికి అందచేశారు. 2024కు కవి, సినీరచయిత, నాటక రచయిత, నటుడు, దర్శకుడు, నంది పురస్కార గ్రహీత తనికెళ్ల భరణిని ఎంపిక చేసినట్లు ట్రస్టు అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. పురస్కార ద్రవ్యం క్రింద రూ.20వేలు, పట్టువస్త్రాలను పురస్కార గ్రహీతకు అందచేయనున్నట్లు తెలిపారు. స్థానిక కామినేని కళ్యాణ మండపంలో పురష్కార సభ ఆదివారం జరుగుతుందని తెలిపారు.

ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల రూరల్



ఎఎంసి కార్యదర్శి నిర్మలదేవి

రైతులు ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చే వరకు ధాన్యాన్ని గిడ్డంగుల్లో నిల్వ చేసుకోవచ్చని ఎఎంసి కార్యదర్శి కె నిర్మలా దేవి కోరారు. తన కార్యాలయంలో విలేకరులతో శనివారం మాట్లాడారు. 4450మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గిడ్డంగులు అందుబాటులో ఉన్నాయన్నారు. పంట భద్రంగా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. రైతు బంధు పథకం ద్వారా 6నెలల వరకు వడ్డీ లేని రుణ సౌకర్యం ఉందన్నారు. రెండు లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్రమ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

మండలంలోని వేమవరం గ్రామంలో పక్కా సమాచారంతో అక్రమంగా మద్యం అమ్ముతున్న సమాచారం అందుకున్న ఎస్ఐ వేమన తన సిబ్బందితో కలిసి మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న 35క్వార్టరు బాటిల్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - బాపట్ల

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శనివారంకు 18వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్స్ ను ప్రభుత్వం చిత్త శుద్ధి తో పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం ప్రతినిధి జి రమేష్ కోరారు. సమ్మెలో రమేష్, రంగనాథ్, మాణిక్యరావు, రాజేష్, సుధారాణి, అబ్రాహాం, సుజాత, అంజనాదేవి, నాగమణి, నాగరాజు పాల్గొన్నారు.

పంగులూరు : సర్వ శిక్ష అభియాన్ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద సర్వ శిక్ష సిబ్బందిని కలిసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షులు టివి నరసింహారావు, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి బి సుబ్బారావు, జిల్లా కౌన్సిలర్లు ఎస్‌విడివి ప్రసాద్, కె సాయి సత్యనారాయణ, బి రవిచంద్రబాబు, ఎస్ శ్రీనివాసరావు, యు రత్తయ్య, వి ఏడుకొండలు, ఎం రామారావు, ఎస్‌కె బడే సాహెబ్ పాల్గొన్నారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఆగళ్లమూడి ప్రభాకరరావు

పోటీ పరీక్షల పుస్తకాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు (అమృతలూరు)

ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాక శేషగిరిరావు అమర్తలూరు గ్రంథాలయాన్ని శనివారం సందర్శించారు. అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆళ్లమూడి ప్రభాకరరావు చేతుల మీదుగా రిటైర్డ్ ఐఆర్‌టిఎస్ అధికారి అప్పికట్ల భరత్ భూషణ్ రచించిన విజయానికి మార్గదర్శి అనే తెలుగు వర్షన్ పుస్తకాన్ని, విక్టరీ గైడెన్స్ అనే ఇంగ్లీష్ వర్షన్ పుస్తకాన్ని పోటీ పరీక్షలు నిమిత్తం అందజేశారు. కార్యక్రమంలో అమృతలూరు, చేబ్రోలు ఎంపీపీలు రాపర్ల నరేంద్ర, కొక్కిలిగడ్డ కిరణ్, సర్పంచ్ దేవరకొండ రాము పాల్గొన్నారు.



ధర్మవరం చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జ్యోతి చంద్రమౌళి

ధర్మవరం చరిత్ర పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని ధర్మవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో హెచ్‌ఎం ఊటుకూరు శ్రీనివాసులు అధ్యక్షతన విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన ధర్మవరం చారిత్రక వైభవం పుస్తక పరిచయసభ నిర్వహించారు. డాక్టర్ ఉబ్బా దేవపాలన పుస్తకం గురించి పరిచయం చేస్తూ ధర్మవరం ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన గ్రామమని, జైనమత తీర్థంకరులు ఇక్కడి నుండే మత ప్రచారం చేశారని చెప్పారు. పుస్తక రచయిత విద్వాన్ జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ ఆదిమానవుల కాలం నుండి నేటి వరకు జరిగిన ధర్మవరం చరిత్రను వివరించారు. అద్దంకి శాసనం, కందుకూరు శాసనం వేయించిన పండరంగని గురించి చరిత్రను కళ్ళముందు చూయించారు. కార్యక్రమంలో ఎంఇఒ బూదాటి సుధాకరరావు, ధర్మవరపు ఛారిటీస్ అధ్యక్షులు ధర్మవరపు హరిబాబు, ధర్మవరపు శ్రీనివాసరావు, ధర్మవరపు శ్రావణ కుమార్ పాల్గొన్నారు.

అపోహలు వద్దు... వెంకటేషే అభ్యర్థి : బలరాం

ప్రజాశక్తి - వేటపాలెం



మాట్లాడుతున్న ఎంఎల్ఎ బలరామకృష్ణమూర్తి

వైసిపి అభ్యర్థిగా తన కుమారుడు కరణం వెంకటేష్ బాబు బరిలో నిలుస్తాడని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్ఆర్ పింఛన్ పంపిణీలో ఆయన మాట్లాడారు. కొంతమంది వైసిపి నాయకులు టికెట్ కేటాయింపుపై అనుమానాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని, పింఛన్ల పంపిణీలో అసందర్భంగా వచ్చిన మాటలకు బదులు ఇవ్వాల్సి వచ్చిందని అన్నారు. ఎలాంటి అపోహలు లేకుండా ప్రతి ఒక్కళ్ళు తన కుమారుడు కరణం వెంకటేష్ బాబును తనను ఆదరించినట్లే ఆశీర్వదించాలని కోరారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్వయంగా తనతో మాట్లాడుతూ వెంకటేష్ బాబును తనకప్పగించండి తన టీం ద్వారా పనిచేయుచు కుంటానని తనను అడిగినట్లు చెప్పారు. గతంలో చీరాల ప్రాంతంలో జరిగిన అనేక అక్రమాలు గురించి మీ అందరికీ తెలుసు కాబట్టే తనను 20వేల ఓట్లకు పైగా మంచి మెజార్టీ ఇచ్చి గెలిపించారని అన్నారు. ఎవరో గిట్టని వాళ్ళు ప్రేలాపనలు పలకటం వలన స్టేజి మీద ఉన్న వాళ్ళు కూడా అనుమానం వ్యక్తం చేయటం ఏంటని ప్రశ్నించారు. రానున్న ఎన్నికలలో వెంకటేష్ బాబుని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

పోరాటయోధుడు మోహనరావు

సంతాప సభలో విరసం నేత కళ్యాణరావు

ప్రజాశక్తి - పంగులూరు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న జి కళ్యాణరావు

ఉద్యమాలే ఊపిరిగా బతికిన బత్తుల మోహనరావు గొప్ప పోరాట యోధుడని, ఆయన లేకపోవటం ఉద్యమానికి తీవ్రమైన లోటని విరసం నాయకులు జి కళ్యాణరావు అన్నారు. పిడీఎం ప్రకాశం జిల్లా గౌరవ అధ్యక్షులు బత్తుల మోహనరావు సంస్మరణ సభ బయట మంజులూరులో శనివారం నిర్వహించారు. సభకు పిడిఎం రాష్ట్ర కార్యదర్శి కె వెంకటేష్ అధ్యక్షత వహించారు. కళ్యాణరావు మాట్లాడుతూ బత్తుల మోహనరావు 80ఏళ్ళకుపైగా జీవించాడని, ఆయన జీవితంలో విప్లవ కమ్యూనిస్టు పార్టీ నుండి నేటి వరకు అనేక ప్రజా ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేశాడని అన్నారు. ఆయన కోరుకున్న సోషలిస్ట్ సమాజ స్థాపన కోసం పోరాటమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. పిడిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వైవీ మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా మోహనరావు పనిచేశాడని అన్నారు. ప్రస్తుతం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారని అన్నారు. గత కొంతకాలం నుండి తీవ్ర అనారోగ్యంతో గ్రామంలోనే ఉంటున్నాడని, బత్తుల మోహనరావు అనేక కుట్ర కేసులు ఎదుర్కొన్నాడని, కొంతకాలం జైలులో కూడా ఉన్నాడని, అన్ని కేసులు కొట్టివేయబడ్డాయని అన్నారు. చివరి వరకు ప్రజా ఉద్యమాలతో ప్రయాణించాడని, ఆయన స్ఫూర్తిని కొనసాగిద్దామని అన్నారు. పికెఎం రాష్ట్ర కార్యదర్శి జె కోటి, చేనేత జన సభ వ్యవస్థాపక అధ్యక్షులు మాచర్ల మోహనరావు, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బొప్పూడి అంజమ్మ, రైతు కూలి సంఘం నాయకుడు ఎన్ బ్రహ్మయ్య నివాళులర్పించరు. ప్రజా కళా మండలి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

ఓలేరు వద్ద బ్యారేజీ నిర్మాణం లేనట్టేనా?

ప్రజాశక్తి - భట్టిప్రోలు



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబు

కృష్ణా నది పరివాహ ప్రాలంక గ్రామాల్లో వాణిజ్య పంటలు ఉప్పునీటి కారణంగా దెబ్బతింటున్నాయనే దృక్పథంతో సిఎం జగన్మోహన్‌రెడ్డి పోలేరుపల్లి పాలెం వద్ద బ్యారేజీ నిర్మిస్తానని చేసిన ప్రకటించడం లేనట్టేనా అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తునుగుంట్ల సాయిబాబా ప్రశ్నించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చుండూరు మండలంలో 2022 డిసెంబర్‌లో విద్యార్థులకు ట్యాబులు పంపిణీలో సిఎం ప్రకటించి వరాల్లో ఒకటని అన్నారు. ఉప్పు తీవ్రతను తట్టుకునేందుకుగాను ఉప్పునీరు నదిపైకి ఎగబాకకుండా బ్యారేజీ నిర్మించేందుకు రూ.2500కోట్లు కేటాయించి ఏప్రిల్ నెల్లోనే పనులు ప్రారంభిస్తామని ప్రకటించారని, దానిని మంత్రి నాగార్జున ఎంతవరకు తీసుకొచ్చారని అడిగారు. జంపని షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని సిఎం చేసిన ప్రకటన ఎంతవరకు పరిష్కారం అయ్యిందని అన్నారు. రూ.17.60కోట్లు కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కుక్కల వెంకటేశ్వరరావు, మాజీ మండల కన్వీనర్ వై కరుణ శ్రీనివాసరావు, కనపర్తి సుందరరావు, ఎడ్ల జయశీలరావు, కంభం సుధీర్, లెనిన్, ఆదిని బసవపున్నయ్య పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ నిర్మించాలి

ప్రజాశక్తి - వేటపాలెం

వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర సందర్భంగా విచ్చేసిన గుజరాత్ రాజ్యసభ సభ్యులు బాబుబాయి దేశాయ్‌ని బిజెపి జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులు పామంజి రాంబాబు, పండరీ కాక్షయ్య సమక్షంలో కటారిపాలెం, పొట్టి సుబ్బయ్య పాలెం, తానాకాలనీ మత్స్యకార పెద్దలు కటారి తిరుపతయ్య, ఎల్లంగారి సుబ్రహ్మణ్యం, కొండూరి అంజయ్య, కొండూరు ఆనందరాజు మర్యాదపూర్వకంగా కలిశారు.

మౌళిక సదుపాయాలుండాలి

ప్రజాశక్తి - పర్చూరు

పాఠశాలలకు మౌలిక సదుపాయాలు ఉండాలని, ఆ బాధ్యత పాఠశాల హెచ్‌ఎంలదేనని డీఈఒ పీవీజే రామారావు ఆదేశించారు. ఎంపీడీఒ కార్యాలయంలో 6మండలాల ఎంఈఒలు, హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు.

సైకో పాలనకు స్వస్తి పలకాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్



ఏలూరి సాంబశివరావు

వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలికి సైకో జగన్ పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కదలి రావాలని టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కోరారు. అవినీతి అరాచక పాలనను తుదముట్టించడం మనందరి బాధ్యత అన్నారు. రా. కదలి రా. కార్యక్రమం ద్వారా ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు వివరించాలని అన్నారు. మహాశక్తి, తల్లికి వందనం, దీపం, యువగళం, అన్నదాత, ఇంటింటికీ నీరు, పూర్ టు రిచ్, బీసీ రక్షణ చట్టం అమలు చేస్తామని అన్నారు. ఈ పథకాల ద్వారా ఏడాదికి ఒక్కొక్క కుటుంబానికి రూ.లక్షన్నర లబ్ది చేకూరుతుందని తెలిపారు. 5ఏళ్లలో రూ.6లక్షల లబ్ధి పొందుతారని తెలిపారు.



ఓటర్ల జాబితాలపై బిఎల్‌ఒలతో చర్చిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాష

బిఎల్‌ఒలు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితాను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ పి రంజిత్ భాషా బిఎల్‌ఓలను ఆదేశించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో 2024ఓటర్ల సవరణ జాబితాను బిఎల్‌ఓలతో శనివారం సమీక్షించారు. ఓటర్ల సవరణ, కొత్త ఓటర్ల జాబితా విడుదల వంటి అంశాలపై బిఎల్‌ఒలు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడ ఏమాత్రం పొరపాట్లు జరిగినా సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌డిఓ జి రవీందర్, తహసిల్దార్ చిన్నం సుధారాణి పాల్గొన్నారు



కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - బాపట్ల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 6న నిర్వహించనున్న మాదిగ స్టూడెంట్ సమాఖ్య జాతీయ సమావేశానికి అనుమతి నిరాకరణకు నిరసనగా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించినట్లు ఎమ్మార్పీఎస్ పట్టణ కన్వీనర్ తాళ్లూరి రాజేష్ మాదిగ శనివారం తెలిపారు. సమావేశానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ కలెక్టరుకు వినతి పత్రం అందజేశారు. మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బుదంగుంట్ల లక్ష్మీనరసయ్య మాదిగ మాట్లాడుతూ వైస్ ఛాన్సలర్ రాజకీయ పార్టీలకు కొమ్ము కాస్తూ మాదిగ సామాజిక వర్గాన్ని అణగదొక్కే ధోరణి అవలంబిస్తున్నారని అన్నారు. టీడీపీ, వైసీపీ వంటి రాజకీయ పార్టీలకు, ఇతర విద్యార్థి సంఘాల సభలకు అనుమతినిచ్చి మాదిగ విద్యార్థుల సభకు ఆటంకాలు కల్పించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వైస్ ఛాన్సలర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ దుడ్డు వందనం, బేతపూడి వెంకటేశ్వరరావు, కటికల అబ్రాహాం, గొల్లంమంద మత్తయ్య, యాజలి గోపి, నాగరాజు, డేవిడ్, రవి పాల్గొన్నారు.

48వ గంధ మహోత్సవం

ప్రజాశక్తి - వేటపాలెం



కరపత్రం ఆవిష్కరిస్తున్న ముస్లింలు

శ్రీ దాదా అమీన్ పీర్ స్వాముల వారి 48వ గంధ మహోత్సవం ఈ నెల 8న ప్రారంభమ వుతుం దని దాదా అమీన్ పీర్ దర్గా శిష్య బృందం శనివారం తెలిపారు. రాత్రి గం. 9-00 ల నుండి బయాన్ సూఫీ తత్వ విశిష్టతను, సూఫీ గురువుల మహిమలను, జీవిత చరిత్రను ప్రవచనాల రూపంలో వివరిస్తారని తెలిపారు. శ్రీవారి గంథము, మెరవణి దర్గా నుండి బయలుదేరి ఫకీర్ల జల్సాలతో, బ్యాండు వాయిద్యములతో, రంగు రంగుల విద్యుద్దీపాల అలంకరణలతో, బాణాసంచాలతో వైభవముగా జాండ్రపేట పుర వీధుల్లో నగరోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అలీ ఖాన్, వలి ఖాన్, ఎన్‌వి శివయ్య, షేక్ కరిముల్లా, ఎస్‌కె మస్తాన్‌వలి, అహ్మద్ ఖాన్, ఇమాంబుడి, చక్రవర్తి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమ్మెపై

ఎస్మా ప్రయోగం అప్రజాస్వామికం

ఖండించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్


అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మాను ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 2 జారీ చేయడాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటి తీవ్రంగా ఖండించింది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ తక్షణమే జీవో నెంబర్ 2 ను ఉపసంహరించి, వారితో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.గత 26 రోజులుగా శాంతియుతంగా జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మెను ఎస్మా చట్టపరిధిలోకి తీసుకువచ్చి సమ్మెను నిషేధించడం ప్రభుత్వ నియంతత్వవైఖరికి నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్య విలువలను ఏమాత్రం ఖాతరు చేయని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమ్మెను క్రూర చట్టాల ద్వారా అణచివేయాలని చూడడాన్ని తీవ్రంగా ఖండ స్తున్నామన్నారు. ప్రభుత్వ నియంతత్వ వైఖరి కొనసాగితే జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

కేంద్ర కార్మిక సంఘాలు ఖండన

అంగన్‌వాడీ ఉద్యమంపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఆర్.మోహన్ ఓ సంయుక్త ప్రకటనలో ఖండించారు. గత 26 రోజుల నుంచి అంగన్‌వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం పోరాటం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాలుగా నిర్వీర్యం చేయాలని చూస్తుందన్నారు. సమ్మెను విరమింపజేయాలని రకరకాల ప్రయత్నాలు చేస్తున్నా అంగన్‌వాడీలు పట్టుదలగా పోరాటం కొన సాగిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించి ఆరు మాసాల పాటు సభలు సమావేశాలు సమ్మెలు చేయరాదని చట్టం తీసుకురావటం దుర్మార్గమన్నారు. ఎస్మా చట్టాన్ని కేంద్ర కార్మిక సంఘాలు ఖండిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఆదివారం జీవో పత్రులు దహనం చేయనున్నట్లు వారు పేర్కొన్నారు



సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

సంఘీభావం తెలిపిన వివిధ సంఘాల నేతలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సమగ్ర శిక్ష ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జెఎసి ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద చేపట్టిన సమ్మె శనివారం 18వ రోజుకు చేరింది. ఈ సమ్మెకు జెఎసి జిల్లా అధ్యక్షులు ఎం.హరిబాబు అధ్యక్షత వహించారు. తొలుత ఈనెల 5న మరణించిన ఐఇఆర్‌పి లక్ష్మీనరసింహారావు చిత్రపటానికి నివాళుర్పించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ విజయవాడ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయ ముట్టడికి వెళ్లకుండా ఎన్ని ఇబ్బందులు పెట్టినా, పోలీసులు నోటీసులిచ్చినా ఉద్యోగులు భయకుండా వెళ్లారన్నారు. విజయవాడ ఎస్‌పిడి కార్యాలయం వద్ద అరెస్టులతో భయానక వాతావరణం సష్టించినా ఉద్యోగులు రోడ్లపై బైఠాయించి నిరసన తెలిపారన్నారు. ఎమ్మెల్సీ ఐవిని, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఫెడరేషన్ చైర్మన్ నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు కాంతారావును అరెస్ట్ చేశారన్నారు. జెఎసి జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణి, అనేక మంది ఉద్యోగులను అరెస్టు చేసి కళ్యాణ మండపానికి తరలించారన్నారు. ఎస్‌పిడి ఎమ్మెల్సీ ఐవి, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఫెడరేషన్ చైర్మన్ నాగేశ్వరరావు, కాంతారావు ఐదుగురు ఉద్యోగుల బృందాన్ని చర్చలకు పిలిపించారన్నారు. హెచ్‌ఆర్ పాలసీని ప్రధాన డిమాండ్ గా పెట్టారని, ఇందుకు తాము అనుకూలమేనని అధికారులు చెప్పారన్నారు. విద్యా శాఖ మంత్రితో కూర్చొబెట్టి కమిటీని వేసి నిర్ణయిస్తామన్నారు. చర్చలకు పిలిచి సానుకూల నిర్ణయం, అమలు పరిచేంత వరకు సమ్మెలో ఉంటామని రాష్ట్ర జెఎసి నేతలు తెలియ జేశారన్నారు. ఉద్యోగులకు సమ్మెకు సిఐటియు మాజీ రాష్ట్ర కార్యదర్శి వై.సిద్ధయ్య, శ్రామిక మహిళ కన్వీనర్ పి.కల్పన సంఘీభావం ప్రకటించి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. సమ్మెలో జెఎసి జిల్లా ప్రధాన కార్యదర్శి యు.కళ్యాణి, సభ్యులు ఎన్.మధు, నరసింహం,

క్రీడలతో మానసిక ఉల్లాసం : బూచేపల్లి

ప్రజాశక్తి-చీమకుర్తి

క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగు తుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. మండల పరిధిలోని బూదవాడ గ్రామంలో బూదవాడ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలను శని వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహి స్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచి మేదరమెట్ల శ్రీనివాసులు, సర్పంచి మరియమ్మ, ఎంపిటిసి పాపిరెడ్డి, జనరాజు యాకోబు, జె. శామ్యూల్, ధర్మారపు సంజీవిరెడ్డి, డి.వెంకటరావు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

నేడు 'పది' మోడల్ పరీక్ష

ప్రజాశక్తి-చీమకుర్తి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో యుటిఎఫ్ సహకారంతో ఆదివారం 10వ తరగతి మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు తెలిపారు. స్థానిక దాచూరి రామిరెడ్డి భవనంలో పరీక్షకు సంబంధించిన పోస్టర్లు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పరీక్షలపై అవగాహన పెంచు కొనేందుకు మోడల్ పరీక్షలు ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేవరాజులు, యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.అక్బర్, చలువాది శ్రీను, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వాసుబాబు, యుటిఎఫ్ మండల నాయకులు జి. వెంకటేశ్వర్లు, వీరారెడ్డి, బ్రహ్మయ్య, పర్వతం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమ్మె బాట

తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 27వ రోజుకు చేరింది. అంగన్‌వాడీల విన్నపాలను పెడచెవిన పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం వారిపై ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ జీవో నంబరు 2 జారీ చేసింది. ఈ నెల వేతనాల్లో కోత పెట్టింది. తమకు ప్రభుత్వం గౌరవ వేతనం ఇస్తుందని, తాము కనీస వేతనం అడుగుతున్నామని ఆ విషయాన్ని గురించి పట్టించుకోకుండా తమపై ఎస్మాను ప్రయోగించడం పట్ల అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. 27 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్న తమను ఎస్మా చట్టపరిధిలోకి తీసుకొచ్చి సమ్మెను నిషేదించడమే కాకుండా సమ్మె కాలానికి జీతాల్లో కోత విధించడం దుర్మార్గమన్నారు. .ఇప్పటికే పలు రూపాల్లో నిరసన తెలిపిన అంగన్‌వాడీలు 24 గంటల నిరాహార దీక్షలకు పూనుకున్నారు.



సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు కూడా సమ్మెలో ఉన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వానికి విన్నపాలు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో వారు సమ్మెకు దిగారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు 19 రోజులుగా,మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఈ నెల 3 నుంచి సమ్మెలో ఉన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు గత నెల 26 నుంచి సమ్మెలో ఉన్నారు. మున్సిపల్ కార్మికులకు రాష్ట్రప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని,కార్మికులకు కనీసం వేతనం రూ 26 వేలు ఇవ్వాలని కోరుతున్నారు.

టిడిపి అధినేత చంద్రబాబు కనిగిరిలో నిర్వహించిన రా కదలి రా సభ టిడిపి శ్రేణుల్లో ఉత్సాహాన్ని తెచ్చింది. సభలో చంద్రబాబు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు. టీడీపీ అధికారంలోకి రాగానే మార్కాపురం జిల్లా కావాలనే ఆ ప్రాంత ప్రజల కోరిక తీరుస్తామని హామీ ఇచ్చారు. కనిగిరికి ట్రిపుల్ ఐటీ తీసుకువస్తానన్నారు. ప్రకాశం జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య లేకుండా చేస్తామన్నారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించే పనులు చేస్తామన్నారు. ఒంగోలు, మార్కాపురం, కనిగిరిలో టిడ్కో ఇళ్లు పూర్తి చేసి అబ్ధిదారులకు అప్పగించే బాధ్యత తీసుకుంటా మన్నారు. ప్రకాశం జిల్లాకు ఆక్వా, గ్రానైట్, ఫార్మా పరిశ్రమలు తీసుకువచ్చే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రకాశం జిల్లాలో జరిగిన కుంభకోణాలపై సిట్ చేత దర్యాప్తు చేయిస్తామన్నారు.


వైసిపి తరపున రానున్న ఎన్నికల్లో ఎవరు పోటీ చేస్తున్నారు అనే విషయమై బాపట్ల జిల్లాలో కొంత మేర స్పష్టత వచ్చింది. గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలని భావిస్తున్న వైసిపి అధినేత జగన్ అభ్యర్థుల ఎంపికలో సర్వేలకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రకాశం జిల్లాకు సంబంధించి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి ఎక్కడ నుంచి పోటీ చేస్తారనే విషయంపై సృష్టత రాలేదు. వైసిపిలోనే ఉంటారా పార్టీ మారుతారా అనే విషయంపై పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా

తాటిపర్తి చంద్రశేఖర్‌కు సన్మానం

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైసిపి యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి తాటిపర్తి చంద్రశేఖర్‌ను వైసిపి రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. చంద్రశేఖర్‌కు అభినందనలు తెలిపిన వారిలో మూలగుంటపాడు గ్రామ మాజీ సర్పంచి చుక్కా కిరణ్‌కుమార్, మాదాల శంకర్, షేక్‌కరీం, అంకయ్య, దత్తు, చొప్పర వెంకన్న, మన్సూర్, మహమూద్ బాషా, సోమిశెట్టి సురేష్, తన్నీరు నాగేశ్వరరావు, పాలూరి శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, చిమట శ్రీను, కుంచాల రవి, కొక్కిలిగడ్డ హనుమంతరావు, షేక్ అల్లావుద్దీన్, ఎస్‌కె.నౌషాద్, మిరియం వెంకటేశ్వర్లు, మిరియం సుధాకర్, కోడిపల్లి శివ, చొప్పర భాస్కరరావు తదితరులు ఉన్నారు.



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న డాక్టర్ అశోక్ కుమార్ రెడ్డి, వైసిపినాయకులు

కలెక్టర్,ఎస్పిని కలిసిన చంద్రశేఖర్

వైసిపి యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి తాటిపర్తి చంద్రశేఖర్ జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్‌పి మల్లిక గర్గ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొండపి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు షేక్ లియాఖత్ పాల్గొన్నాడు.